కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :164 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శనివారం 17-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

బంగ్లాదేశ్ లాంటి 'పాలన మార్పు' కావాలట.. విపక్షాలకు రాజ్‌నాథ్ కౌంటర్



న్యూఢిల్లీ, దేశంలో గందరగోళం సృష్టించడానికి ప్రజాస్వామ్యం ఎలాంటి లైసెన్స్ ఇవ్వదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. యువ శక్తిని వాడుకుని విపక్షాలు అరాచకాన్ని వ్యాప్తి చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. బంగ్లాదేశ్ లాంటి పాలన మార్పు కావాలని కాంగ్రెస్ , దాని మిత్రపక్షాలు కోరుకుంటున్నాయని ధ్వజమెత్తారు. ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూలో జరిగిన మీడియా సమావేశంలో విపక్షాల ఆందోళనలపై రాజ్‌నాథ్ స్పందించా రు."రాజకీయాల కోసం కాంగ్రెస్, దాని మిత్ర పార్టీలు ఈ దేశ యువతను పావులుగా వాడుకుంటున్నాయి. దేశాభివృద్ధిలో నిర్మాణాత్మక పాత్ర పోషించేలా యువతకు దిశానిర్దేశం చేయడానికి బదులు.. రాజకీయ ఘర్షణలను రెచ్చగొట్టేందుకు వారిని ఉపయోగించుకుంటున్నాయి. పాలన మార్పు కోసం బంగ్లాదేశ్ నుంచి స్ఫూర్తి పొందామని వారు బహిరంగ సమావేశాల్లోనే చెబుతున్నారు. ప్రభుత్వాన్ని పడగొడుతామని అంటున్నారు. వారి పోరాటం ఎన్నికల వ్యవస్థ, సర్ ప్రక్రియకు సంబంధించిన సమస్యలపై కాదు..! ప్రజాస్వామ్య సంస్థలను కూల్చివేసి, దేశాన్ని తగలబెట్టడమే వారి ఏకైక అజెండా అని స్పష్టమవుతోంది" అని రాజ్‌నాథ్ విమర్శించారు.ఈ సందర్భంగా విపక్షాల ర్యాలీని తప్పుబడుతూ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను రక్షణమంత్రి సమర్థించారు. "శాంతిభద్రతలను కాపాడటానికి చట్టాన్ని గౌరవించడం అత్యవసరం. రాజకీయ స్వప్రయోజనాల కోసం ప్రజాస్వామ్య సంస్థలను బలిచేయకూడదు. ఇలాంటి అసత్య ఆరోపణలతో, అవకాశవాద రాజకీయాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించలేం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇకనైనా ప్రజా తీర్పును గౌరవించి.. రాజకీయాల్లో తన పాత్రపై ఆత్మపరిశీలన చేసుకోవాలి. భారత భవిత ప్రతి ఒక్కరి బాధ్యత" అని రాజ్‌నాథ్ విపక్ష నేతకు చురకలంటించారు.

ప్రధాని పదవి కావాలంటే..: కంగన

విపక్షాల నిరసనలు,పాలనమార్పు వ్యాఖ్యలపై నటి,భాజపా ఎంపీ కంగనా రనౌత్ స్పందిస్తూ..ప్రధాని మోదీ పాత వీడియో ఒకటి షేర్ చేశారు.అందులో మోదీ మాట్లాడుతూ..ఎన్నికల్లో గందరగోళం సృష్టిస్తే ప్రధాని కాలేరని, ప్రజల హృదయాలను గెలుచుకోవాలని అన్నారు.కంగన ప్రతిపక్ష నేతలకు కౌంటర్ ఇచ్చారు.

అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు: మంత్రి వివేక్!



సిద్దిపేట: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులందరికీ పట్టాలు అందజేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు చర్యలు చేపడుతోందని తెలిపారు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని రామలింగేశ్వర గార్డెన్‌లో నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత రెండేళ్లలో సిద్దిపేట జిల్లాకు 15 వేల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు.

ఆంధ్రలో జల పండగ ఎట్లయితది? తెలంగాణలో కరువు ఎందుకుంటది?

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ అర్ కీలక వ్యాఖ్యలు చేశారు. సింగరేణి నిండా కుంభకోణాలు ఉన్నాయి అని నేను చెప్పిన. కాంగ్రెస్ చేసిన కుంభకోణాలని ప్రజల ముందు పెడితే రేవంత్ రెడ్డి నిన్న అడ్డగోలుగా మాట్లాడిండు. నువ్వు ఉత్తరం రాస్తే నేను విచారణకు ఆదేశిస్తా అన్నాడు. ఎమిడియా ముందు మాట్లాడుడు కాదు, దమ్ముంటే సింగరేణి కుంభకోణం పైన ప్రతిపాదిత విదేశీ బొగ్గు కొనుగోళ్లపైన విచారణ సిట్టింగ్ జడ్జితో చేయించాలని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు.

దమ్ముంటే సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించు..

బొగ్గు అంశంలోనే కాదు, దమ్ముంటే నువ్వు చేసిన అక్రమాలపై కూడా సిట్టింగ్ జడ్జితో విచారణకి ఆదేశించు. నీ బామ్మర్ది సింగరేణిలో కొల్లగొట్టిన 10వేల కోట్ల కుంభకోణంపై విచారణ వెయ్యి. సింగరేణిలో నువ్వు చేసిన సోలార్ పవర్ కుంభకోణం బయటపెడతానని పేర్కొన్నారు. సింగరేణిని బొందపెట్టి ఇప్పుడు 70 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన సింగరేణిని కాదని విదేశీ బొగ్గు తేవడానికి కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. గతంలో రాష్ట్రంలో 24 గంటల పాటు కరెంట్ పోకుండా అండగా నిలబడింది సింగరేణి.ఇప్పుడు అదే సింగరేణిని రేవంత్ రెడ్డి బద్నాం చేస్తున్నాడని మండిపడ్డారు. సంక్షోభంలోకి నెట్టిన తర్వాత ఇప్పుడు ముఖ్యమంత్రి బొగ్గు తేవాలి, కరెంట్ కొనాలి అని అంతా ఆగమైనంక చెబుతున్నాడు.

రేవంత్ రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి

సింగరేణి బొగ్గు వద్దు, భారతదేశంలో ఉండే బొగ్గు వద్దు అని అంటున్న ముఖ్యమంత్రి విదేశీ బొగ్గు కావాలి అంటున్నాడు. ఆస్ట్రేలియా నుంచి బొగ్గు కొంటే కమీషన్లు వస్తాయి. సింగరేణిలో రూ.3,800కి టన్నుకి దొరికే బొగ్గు, విదేశాలలో అయితే 10, 12 వేలు వస్తాయి కాబట్టి అక్కడ కమీషన్లు కొట్టడం కోసమే ఈ కుట్ర చేస్తున్నాడని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి..ఈఎంఐ కట్టకుంటే ఈయన పదవి పోతుంది కాబట్టే ఇప్పుడు బొగ్గు కుంభకోణంతోని స్కామ్ కుంభకోణం స్కామ్ చేసి ముడుపులు కట్టేందుకు ప్రయత్నం చేస్తున్నాడని ఎద్దే చేశారు.కాంగ్రెస్ కి కట్టే ఈఎంఐల కోసమే ఇక్కడ ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ఉన్నాడు. ఈ రికవరీ ఏజెంట్ లాంటి ఈ ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రేవంత్ రెడ్డి కమీషన్లు కట్టకుంటే ఆయన పదవిని గుంజి పడేస్తాడు. రేవంత్ రెడ్డి పదవి రెన్యువల్ కాదు. రేవంత్ రెడ్డి అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఇప్పుడు అందరిని మోసం చేస్తున్నాడని విమర్శించారు.



కమీషన్ల కోసమే సింగరేణిలో ఉత్పత్తి తగ్గింపు..

సింగరేణి భూజం మీద తుపాకి పెట్టి టెండర్లు, కమీషన్ల లెక్కలు వేసుకుంటున్నాడు. సింగరేణిలో ఉత్పత్తి తగ్గించిండు. అందుకే ఈరోజు కరెంట్ ఉత్పత్తి కేంద్రాల దగ్గర బొగ్గు లేదు. సింగరేణికి 60వేల కోట్ల బాకీలు పెండింగ్ లో పెట్టి బొగ్గు ఇవ్వడం లేదని బద్నాం చేస్తున్నడని తెలిపారు. ఒకనాడు 24 గంటల కరెంట్ వచ్చిన తెలంగాణలో ఇప్పుడు కరెంట్ ఎందుకు లేదు?

పార్టీ మారగానే కల్వకుంట్ల కుటుంబం మంచిదైందా?

జగిత్యాల: కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు కేసీఆర్, కేటీఆర్‌తో పాటు కల్వకుంట్ల కుటుంబంపై నిప్పులు చెరిగిన జీవన్ రెడ్డి.. పార్టీ మారగానే వారంతా మంచివారయ్యారా? అంటూ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి బీఆర్ఎస్ నాయకుడు జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన ఆయన.. "నువ్వు తిట్టినంతగా కేసీఆర్‌ను ఈ రాష్ట్రంలో ఇంకెవరూ తిట్టలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్యలు ఉన్నాయంటూ ఆరోపణలు చేయడం కాకుండా, నీళ్లు అందక ఎక్కడ పంట ఎండిపోయిందో దమ్ముంటే చూపించాలని సవాల్ విసిరారు. శుక్రవారం జగిత్యాల అర్బన్ కాలనీలో రూ.2 కోట్ల నిధులతో నిర్మించనున్న నూతన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కలెక్టర్ బి. సత్య ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి స్పందిస్తూ... 2014 నుంచి 2024 వరకు కేసీఆర్, కేటీఆర్, కాళేశ్వరం ప్రాజెక్టుపై జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రికార్డుల్లో ఉన్నాయని మంత్రి గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని, కల్వకుంట్ల కుటుంబం దోచుకోవడానికే వచ్చిందని గతంలో ఆయనే విమర్శించారని పేర్కొన్నారు. జీవన్ రెడ్డి ఎమ్మెల్యేగా ఓడిపోయిన వెంటనే స్పందించిన సీఎం.. జీవన్ రెడ్డిని క్యాబినెట్‌లోకి తీసుకుంటామని కూడా ప్రకటించారని గుర్తుచేశారు.పార్టీ అన్ని విధాలా అండగా నిలిచినప్పటికీ, పార్టీ మారిన వెంటనే సీఎంపై ఏకవచనంతో మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సొంత పార్టీ ఎమ్మెల్యేలకు, డిప్యూటీ సీఎంకు సైతం కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇచ్చేవారా అని మంత్రి నిలదీశారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో అవసరమైనప్పుడల్లా సీఎంను కలిసి ప్రజా సమస్యలను చర్చిస్తున్నామని, సీఎం సైతం సమస్యలపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందని లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరాపై సీఎం అధికారులకు ఆదేశాలు ఇచ్చారని వివరించారు. మరోవైపు సింగరేణికి గడ్డం పెంచుకుని వెళ్లి కేటీఆర్ ఏం సాధించారని ప్రశ్నించారు. 70 ఏళ్ల వయసులో ఉన్న జీవన్ రెడ్డి తాను ఏం మాట్లాడుతున్నారో ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా రాష్ట్రంలో మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.



వైభవంగా సర్వాయి పాపన్న విగ్రహ ప్రతిష్టాపన

మహబూబాబాద్,గూడూరు మండల కేంద్రంలో బహుజన వీరుడు, సబ్బండ వర్గాల ఆత్మగౌరవ ప్రతీక అయిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. పీడనపై తిరుగుబాటు చేసి అణగారిన వర్గాలకు రాజ్యాధికారాన్ని అందించిన ఆ యోధుని విగ్రహాన్ని ప్రతిష్టించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమైంది.

ఎల్ నినోపై ముందుచూపేది? రేవంత్ సర్కార్‌పై కవిత ఫైర్

హైదరాబాద్, ప్రత్యేక రాష్ట్రం వచ్చినా కృష్ణానది ప్రాజెక్టులు పూర్తి చేయలేదని, మూడేళ్లుగా ప్రతి పండకూ రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. వచ్చే 10 నెలలు తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కోబోతున్నామని, ఎల్ నినోపై రేవంత్ రెడ్డి ముందు జాగ్రత్తలు తీసుకోవడం లేదని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత.. పాలకుడు అనే వ్యక్తి అందరినీ సమానంగా చూడాలి కానీ అందరినీ సమానంగా చూసే దృష్టి రేవంత్ రెడ్డికి లేదన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ ఢిల్లీకి వెళ్లి రాహుల్ గాంధీ పక్కన కూర్చుని రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం కేవడం రేవంత్ రెడ్డికే చెల్లిందన్నారు. ఎల్ నినో విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలం అయ్యారని విమర్శించారు.

ఇంకెన్నాళ్లు పాత ప్రభుత్వంపై విమర్శలు:

నిన్న ప్రెస్ మీట్?లో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఆయన అవగాహన రాహిత్యం, నిస్సాయతను వ్యక్తం చేశారన్నారు. ఎల్ నినో వస్తుందని ఈ ఏడాది ప్రారంభంలోనే నిపుణులు హెచ్చరించారని స్వయంగా ముఖ్యమంత్రే నిన్న చెప్పారు. మరి పది నెలల ముందే ఎల్ నినో వస్తుందని తెలిస్తే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. పక్క రాష్ట్రాలు గత ఆగస్టులోనే కరువు మండలాలను ప్రకటించి కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తే దొంగలు పట్ట ఆర్నెళ్లకు అన్న చందంగా సీఎం ఇప్పుడు వచ్చి రైతులు త్యాగాలు చేయాలని అంటున్నారని విమర్శించారు. రైతులను పంటలు వేయొద్దని చెబుతున్న ముఖ్యమంత్రి తాను రాజకీయాలను త్యాగం చేస్తారా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 30 నెలలు అయిందని ఇంకెన్నాళ్లు పాత ప్రభుత్వాన్ని తిడుతూ కాలం సాగదీస్తారని నిలదీశారు. కేవలం ప్రభుత్వం తన అవగాహన రాహిత్యంతోనే ఈ ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తి చేయలేదని దుయ్యబట్టారు.

రైతు కూలీలకు రూ. 12 వేల పథకం అమలు చేయండి:

ఇప్పుడు సీతక్కతో కమిటీ వేస్తే కేంద్రానికి నివేదిక ఎప్పుడు ఇవ్వాలి వారు అనుమతులు ఎప్పుడు ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి కేవలం నోటి మాట చెప్పి రైతులను మోసం చేయాలని చూస్తున్నారని కానీ లక్షలాది మంది రైతుకూలీలకు ఎలా న్యాయం చేయబోతున్నారని ప్రశ్నించారు. సీఎం మాటలు వినడానికి చాలా బాగున్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వాన్ని నమ్మి రైతుకూలీలను ఎండబెట్టవద్దన్నారు. ఎన్నికల్లో మీరు ఇచ్చిన రైతుకూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని చెప్పిన పథకం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితుల్లో ఆదుకునేలా రాష్ట్రంలోని రైతుకూలీలందరికీ లైఫ్ ఇన్సురెన్స్ చేయించాలని డిమాండ్ చేశారు.



యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

ఓవైపు విద్యుత్ మీద ప్రభుత్వ కంట్రోల్ ఉండాలి అని చెప్తున్న ముఖ్యమంత్రి మరోవైపు విద్యుత్ కేంద్రాలను ప్రైవేటుకు ధారాదత్తం చేసే కుట్రకు పాల్పడుతున్నారని కవిత ఆరోపించారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్లోని వివిధ విభాగాలను ప్రైవేట్ వ్యక్తులకు ఎందుకు కట్టబెట్టారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కరెంట్ లేక రైతులు ఆగమవుతుంటే ఉన్న విద్యుత్ కేంద్రాలను ప్రైవేటీకరించడం వెనక ఉన్న మర్మం ఏమిటి? అని నిలదీశారు. గత నెలలోనే ఇదే ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చిందని ఎందుకు మీరు వైటీపీఎస్?ను ప్రైవేటీకరణ చేస్తున్నారని ప్రశ్నించారు. పవర్ మ్యాక్ కంపెనీతో మీకు ఉన్న ఒప్పందం ఏంటి? దీని వెనుక జరిగిన అవినీతి ఏంటి అని నిలదీశారు. ఇంతటి సంక్షోభంలోనూ ఈ ప్రభుత్వానికి అవినీతిపైనే దృష్టి ఉందని విమర్శించారు. మీ స్వార్థపూరిత చర్యల వల్ల విద్యుత్ యూనిట్ ధర పెంపుతో పాటు సంస్థలో

ఎల్‌నినోపై రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్,ఎల్ నినో విషయంలో శాస్త్రవేత్తలు ఊహించినట్లుగానే పరిస్థితులు చేయిదాటి పోయేలా ఉన్నాయని, నీరు, విద్యుత్ కొరతను తీవ్రంగా ఎదుర్కోబోతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రైతులు యాసంగిలో ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గతేడాది ఈ సమయానికి రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లలో కలిపి 400 టీఎంసీలకుపైగా నీళ్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది 20 9 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని, ఈ నీళ్లనే పొదుపుగా వాడుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.హైదరాబాద్ నీరందించే జలాశయాలు ఎండిపోతున్నాయన్న సీఎం రేవంత్.. రైతులు పెద్ద మనసు చేసుకొని యాసంగి సీజన్లో వరి వేయొద్దని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని.. ఎల్ నినోను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తుందని చెప్పారు. అయితే, ప్రభుత్వ నిర్ణయాలకు ప్రజలు అన్నివిధాల సహకారం అందించాలని ఈ సందర్భ ంగా కోరారు.మార్చిలో ఉండాల్సిన ఉష్ణోగ్రతలు అక్టోబర్ నెలలో నమోదవుతు న్నాయి. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల విద్యుత్ వినియోగం పెరుగుతోం ది. అక్టోబర్ నెలలో ఇంత విద్యుత్ డిమాండ్ గతంలో ఎప్పుడూ లేదు. సాధారణంగా అక్టోబర్ నెలలో 15వేల మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుంది. ఇప్పుడు అది 20వేల మెగావాట్లకు పెరిగిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మార్కెట్లో విద్యుత్ ఏ ధరకు దొరికినా కొనేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి ఓ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి అదనపు విద్యుత్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. విద్యుత్ పై ఇచ్చే సబ్సిడీలను పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నామని రేవంత్ అన్నారు. ఎల్ నినో కష్టకాలంలో రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలని అన్నారు.ఎల్‌నినో వల్ల ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు కేబినెట్ సబ్ కమిటీ వేస్తున్నామని, దసరా తరువాత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో అఖిలపక్ష భేటీ నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రకృతి విపత్తును జయించేందుకు అందరి సహకారం కావాలన్న సీఎం.. దుష్ప్రచారాలను నమ్మకుండా అందరూ సంయమనంతో ఉండాలని కోరారు.

నూతన గౌడ హాస్టల్ భవనం ప్రారంభం!

సంగారెడ్డి :సంగారెడ్డి జిల్లా పటాన్చెరు మండలం నందిగామ గ్రామంలో నూతనంగా నిర్మించిన గౌడ హాస్టల్ భవనం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్.రాజకీయంగా ఈ స్థాయికి రావడం ఆషామాషీ కాదు, కులం సంఘం ఉన్నచోట బిన్న అభిప్రాయాలున్నా అందరూ ముందుకు సాగాలి, తెలంగాణ ఉద్యమంలో అందరూ కలిసి కొట్లాడం, కోకాపేట భవనం పై నిర్మాణకమిటీ వేయండి పనులు వేగంగా జరిగేలా చూస్తా, వృత్తిని



సంపాదకీయం

శనివారం 17-10-2026

సిద్ధాంత పోరాటంలో నిశ్శబ్ద విప్లవం

తమిళనాడు రాజకీయ వేదికపై దశాబ్దాలుగా నడుస్తున్న సిద్ధాంత పోరాటంలో నిశ్శబ్ద విప్లవం కనిపిస్తోంది. ఒకప్పుడు ద్రవిడ ఆత్మగౌరవం, ప్రాంతీయ స్వయంప్రతిపత్తి , హిందీ వ్యతిరేక నినాదాలతో జాతీయ పార్టీలను, ముఖ్యంగా కాషాయ రాజకీయాలను నిరంతరం శత్రువుగా చిత్రీకరించడమే తమిళనాడులో గెలుపు మంత్రంగా ఉండేది. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఆయన తమిళనాడులో అడుగుపెట్టిన ప్రతిసారీ విపక్షాలు, తమిళ జాతీయవాద సంఘాలు గో బ్యాక్ మోదీ నినాదాలతో విరుచుకుపడేవి. నల్లజెండాలు, ఆకాశంలోకి ఎగిరే నల్ల బెలూన్లు ప్రధాని పర్యటనలకు నిరసన కాన్వాయ్‌లుగా మారిన రోజులను తమిళనాడు చూసింది. కానీ, ల చెన్నై మెట్రో ఫేజ్-2 ప్రారంభోత్సవంతో పాటు రూ. 13,000 కోట్ల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కోసం ప్రధాని మోదీ పర్యటించిన తీరును పరిశీలిస్తే, రాష్ట్రీయ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఈ సారి ప్రధాని పర్యటన వేళ గాలిలో నల్ల బెలూన్లు కానీ, రోడ్లపై భయానక నిరసనలు కానీ ఎక్కడా కనిపించలేదు. రాష్ట్రంలో రవాణా, విద్య, పరిశోధన, మౌలిక వసతుల రంగాలు వేగంగా పుంజుకునేలా రూ. 13,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి ప్రధాని ఇక్కడికి వచ్చారు. ఇందులో ప్రధానంగా చెన్నై మెట్రో ఫేజ్-2 మార్గం ప్రారంభోత్సవంతో పాటు ఐఐటీ మద్రాస్ బ్రెయిన్ సెంటర్ సందర్శన లాంటి కీలక అధికారిక కార్యక్రమాలు ఉన్నాయి.ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీతో కలిసి అధికారిక కార్యక్రమంలో పాల్గొనడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అటు పరిపాలన పరంగా, ఇటు రాజకీయ వర్గాల్లో ఈ భేటీ సరికొత్త చర్చకు దారితీసింది. రాజకీయ వైరుధ్యాలు పక్కనబెట్టి, ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం ప్రధానితో ఒకే వేదికను పంచుకోవడమే కాకుండా, మెట్రో రైలులో పక్కపక్కనే కూర్చుని ప్రయాణించడం తమిళనాడు క్షేత్రస్థాయి రాజకీయాల్లో వచ్చిన గుణాత్మక మార్పునకు అద్దం పడుతోంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా కేంద్ర పెద్దల పర్యటనను నిరసనలతో హోరెత్తించే సంస్కృతి స్థానంలో ఇప్పుడు సంయమనం, పరస్పర గౌరవం చోటుచేసుకున్నాయి.తమిళ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియా ట్రెండ్స్‌ను విశ్లేషిస్తే.. తమిళ ప్రజల ఆలోచనా విధానంలో కూడా గణనీయమైన మార్పు వచ్చినట్లు తెలుస్తోంది. ఉచితాలు , సెంటిమెంట్ రాజకీయాల కంటే అభివృద్ధి , మౌలిక వసతుల కే తమిళ యువత ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. చెన్నై మెట్రో విస్తరణ, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, పారిశ్రామిక హబ్‌లకు కేంద్ర నిధులు అత్యంత ఆవశ్యకమని భావిస్తున్న నేపథ్యంలో, అనవసరమైన రాజకీయ ద్వేషం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందనే అభిప్రాయం తమిళ నెటిజన్లలో వ్యక్తమవుతోంది. తమిళనాడు రాజకీయ రంగాన కొత్తగా ఆవిర్భవించిన పొలిటికల్ శక్తులు , మారిన ద్రవిడ కూటముల వ్యూహాలు కూడా ఈ మార్పునకు కారణమయ్యాయి. బీజేపీపై కేవలం రొటీన్ ఆరోపణలతో ఇకపై ఓటు బ్యాంకును నిలబెట్టుకోలేమని గ్రహించిన ప్రధాన ద్రవిడ పార్టీలు, వ్యూహాత్మకంగా తమ ఘర్షణ వైఖరిని తగ్గించుకున్నాయి. ప్రధాని మోదీ సైతం తన ప్రసంగాల్లో తిరుక్కురళ్ పద్యాలను, తమిళ సంస్కృతి, భారతీయార్ కవితలను నిరంతరం ప్రస్తావిస్తూ తమిళ భాషాభిమానాన్ని ఆకట్టుకునేందుకు చేస్తున్న నిరంతర ప్రయత్నాలు కాషాయంపై ఉన్న సైకలాజికల్ భయాన్ని గణనీయంగా తగ్గించాయి. ఈ మార్పు వెనుక ఉన్న మరో ముఖ్యమైన రాజకీయ కోణం.. జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలకు మారుతున్న అవసరాలు. ఒకప్పుడు బీజేపీని అంటరాని పార్టీ గా చూసిన ద్రవిడ నేతలు ఇప్పుడు కేంద్రంతో సత్సంబంధాలు నెరపడం ద్వారానే రాష్ట్ర అభివృద్ధి నిధులు తెచ్చుకోగలమని భావిస్తున్నారు. అంతేకాకుండా, క్షేత్రస్థాయిలో బీజేపీ వేగంగా పుంజుకోవడం, ఓటు బ్యాంకును విస్తరించుకోవడంతో నేరుగా కాషాయ శ్రేణులతో విభేదించడం కంటే రాజకీయ పోటీని ప్రజాసమస్యలపైకి మళ్లించడమే ఉత్తమమని స్థానిక నాయకత్వాలు నిర్ణయించుకున్నాయి. ఒకప్పుడు తమిళనాడు రాజకీయాల్లో విజయానికి మార్గంగా ఉన్న కాషాయ వ్యతిరేకత , బీజేపీ ద్వేషం ఇప్పుడు క్రమంగా తన ప్రాధాన్యతను కోల్పోతోంది. నల్ల బెలూన్ల స్థానంలో అభివృద్ధి భాగస్వామ్యానికి ప్రాధాన్యమిచ్చే నయా రాజకీయ శకం తమిళ నేలలో ప్రారంభమైంది. రాబోయే ఎన్నికల్లో కేవలం భావోద్వేగాలు, ద్రవిడ సెంటిమెంట్లు మాత్రమే కాకుండా, సంక్షేమం , మౌలిక వసతుల రూపకల్పనే గెలుపోటములను నిర్ణయించే ప్రధాన అంశంగా మారబోతోంది.

కూటమిలో కుంపటి.. టీడీపీకి జనసేన కొత్త టెన్షన్ పవన్ వ్యూహమేంటి?

విజయవాడ , ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన కూటమికి ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు కొత్త సవాళ్లు విసురుతున్నాయి. సీట్లు పంపకాల విషయంలో భాగస్వామ్యపక్షం జనసేన ఓ అడుగు ముందుకేసి దూకుడు పెంచింది. అసెంబ్లీ ఎన్నికల్లో 12శాతం సీట్లలో పోటీ చేసిన జనసేన ఇప్పుడు లోకల్‌బాడీల్లో 40శాతం సీట్లు కావాలని అడుగుతోంది. ఇది కేవలం ప్రచారం కాదు.. ప్రభుత్వంలో భాగంగా ఉన్న మంత్రులు, ఆ పార్టీ నేతలు బహిరంగంగానే మాకు కావాలసిన సీట్లు ఇన్నీ.. అని లెక్కలేసి మరీ ప్రకటించేశారు. పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ చేసిన ట్వీట్ కేవలం ఆయన అభిప్రాయంగా చెప్పలేం. అది కచ్చితంగా పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మాటనే. దుర్గేష్ జారీ చేసిన జాబితా చూస్తే.. జనసేన పక్కా వ్యూహంతోనే ఉన్నట్లుగా ఉంది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, వార్డుల స్థాయిలో మొత్తం స్థానాలను పరిగణనలోకి తీసుకుని.. సగటున 40 శాతం వాటాను జనసేన ప్రతిపాదిస్తున్నట్లుగా ఆ జాబితాలో చూపించారు. అందులో మేయర్లు, డిప్యూటీ మేయర్లు, స్టాండింగ్ కమిటీ పదవులు, వార్డు కౌన్సిలర్ల స్థానాలు కూడా ఉన్నాయి. 6 మేయర్ స్థానాలు, 6 డిప్యూటీ మేయర్ స్థానాలు, 44 మునిసిపల్ ఛైర్మన్లు, దాదాపు 2000 వార్డు మెంబర్లు కౌన్సిలర్ స్థానాలు వీరు కోరుతున్నారు. లోకల్ ఎన్నికలకు సంబంధించి టీడీపీకి అస్సలు ఊహలో కూడా లేని నెంబర్ ఇది. ప్రధాన పదవుల్లో 42శాతం, మొత్తం మీద 40శాతం పదవులను జనసేన అడుగుతోంది. ఇప్పుడు వీళ్లు ఇన్ని అడిగితే.. బీజేపీ కూడా అసెంబ్లీ ఎన్నికల వాటా కంటే కచ్చితంగా ఎక్కువుగానే అడిగే అవకాశం ఉంది. దీనిని బట్టి సగం స్థానాలను టీడీపీ మిత్రపక్షాలకు వదలాల్సి ఉంది. దీనికి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారా..? టీడీపీ శ్రేణులు దీనికి సమ్మతిస్తాయా అన్నది అసలు ప్రశ్నజనసేన స్థానిక ఎన్నికల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని అంచనా వేసి అభ్యర్థుల ఎంపికకు సిద్ధమవడం చూస్తే.. ఈసారి సీట్ల పంపకాలను తేలిగ్గా వదిలేయడానికి ఆ పార్టీ సిద్ధంగా లేదని అర్థమవుతోంది. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సీట్ల సర్దుబాటు ఫార్ములానే స్థానిక ఎన్నికలకూ వర్తింపజేయలేమని జనసేన నేత నాదెండ్ల మనోహర్ చాన్నాళ్ల క్రితమే చెప్పారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేసి అద్భుతమైన ఫలితాలు సాధించాయి. ఆ విజయంలో మూడు పార్టీల పాత్ర ఉన్నప్పటికీ, అసెంబ్లీ స్థానాల పరంగా టీడీపీ ప్రధాన భాగస్వామిగా నిలిచింది. ఇప్పుడు స్థానిక ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి సమీకరణాలు మారుతున్నాయి. అప్పుడు జనసేనకు 12శాతం, బీజేపీకి 6శాతం సీట్లు ఇచ్చిన టీడీపీ 80కి పైగా స్థానాల్లో పోటీ చేసింది. అయితే అది ఇప్పుడు కుదరదు అని జనసేన తేల్చేసింది. టీడీపీపై ఒత్తిడి పెంచడానికి ముందు నుంచే ఎక్కువ సీట్లు కావాలని చెబుతోంది. ఇప్పుటికే సీట్లు పంపకాలపై మూడు సార్లు సమావేశమైనప్పటికీ ఏ విషయం తేలలేదు. అంతేకాదు.. తమకు ఎన్నిసీట్లు కావాలో నేరుగా ఆన్‌లైన్‌లో పెట్టేయడం ద్వారా జనసేన ఇప్పుడు బాల్‌ను టీడీపీ కోర్టులోకి నెట్టేసింది. ఇప్పటి వరకూ కూటమిలో ఉన్న పొరపొచ్చాలను బయటకు రాకుండ సర్దుబాటు చేసుకుంటూ వస్తున్న చంద్రబాబుకు ఇది కచ్చితంగా కాస్త ఇబ్బంది కరమే..ప్రస్తుత పరిస్థితిని పవన్ కల్యాణ్ తనకు అనుకూలంగా మార్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. టీడీపీతో పొత్తు కారణంగా జనసేనకు అధికారంలో భాగస్వామ్యం లభించింది. కానీ స్థానిక సంస్థల్లోనూ పార్టీకి తగిన ప్రాతినిధ్యం లేకపోతే, కేడర్‌లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. అందుకే ఈసారి స్థానిక ఎన్నికలను జనసేన తన సంస్థాగత బలాన్ని పెంచుకునే అవకాశంగా దీనిని చూస్తుందనుకోవచ్చు. 40 శాతం వాటా ప్రతిపాదనపై కనుక ఆ పార్టీ సీరియస్‌గా నిలబడితే.. అది సాధారణ సీట్ల పంపకాల చర్చ కంటే పెద్ద రాజకీయ సంకేతమే అవుతుంది. లోకల్ బాడీ ఎన్నికల్లో పెద్ద వాటా తీసుకునేందుకే క్రమంగా జనసేన తమ నేరేటివ్‌ను బలపరుచుకుంటూ వచ్చింది. ముందుగా అంతర్గత కమిటీలు వేసి తమ పార్టీలో బలం ఎంత ఉంది.. ఎక్కడెక్కడ డిమాండ్ ఉందన్న విషయాన్ని చెప్పారు. ఆ తర్వాత నాదెండ్ల మనోహర్ తమ వైఖరి ఏంటో తెగ్గొట్టేశారు. ఇప్పుడు సరైన టైమ్‌లో "మాకు ఇన్నిసీట్లు కావాలి" అని తేల్చేశారు. పవన్ చాలా పకడ్బందీగా ఈ వ్యూహాన్ని అమలు చేసినట్లు కనిపిస్తోంది.పవన్ కల్యాణ్- లోకేష్ పరస్పరం ఎంత సఖ్యతతో ఉంటారన్నది చాలా సార్లు కనిపించింది. అయితే వారిద్దరి మధ్య వచ్చిన కమ్యూనికేషన్ గ్యాప్.. కూటమిలో కాస్త వేడిపుట్టించిందని సమాచారం. ఈ మధ్య కాలంలో పవన్ కల్యాణ్ కూటమి నేతలతో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ప్రచారం, లోకేశ్‌తో దూరం పెరుగుతోందన్న చర్చలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నా.. వీటిని నిర్ధారించే స్పష్టమైన ఆధారాలు కనిపించడం లేదు. కానీ ఎక్కడో తేడా వచ్చిందనే మాటలైతే.. వినిపిస్తున్నాయి.

విజయ్ పర్యటనలో పవన్ కల్యాణ్ మిస్సింగ్

తమిళనాడు ముఖ్యమంత్రిగా తొలిసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన విజయ్ పర్యటన రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది. అయితే విజయ్ పర్యటనలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్కడా కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. విజయ్ విజయవాడ టూర్ షెడ్యూల్ ఖరారైనప్పుడు .. ఆయన వ్యక్తిగతంగా పవన్‌తో భేటీ అవుతారని, లేదంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగే అధికారిక సమావేశంలో డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కల్యాణ్ పాల్గొంటారని జోరుగా ప్రచారం జరిగింది. తీరా చూస్తే, చంద్రబాబుతో జరిగిన జల చర్చల్లో గానీ, పున్నమి ఘాట్ వద్ద జరిగిన విజయవాడ ఉత్సవ్ 2.0 వేదికపై గానీ పవన్ అస్సలు కనిపించలేదు.పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చినప్పుడు.. అదీ సినిమా రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఒక స్టార్ లీడర్ ఏపీకి విచ్చేసిన వేళ, అదే సినీ నేపథ్యం, ప్రజాదరణ ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అధికారిక కార్యక్రమాల్లో భాగస్వామి అయి ఉంటే హుందాగా ఉండేదన్న అభిప్రాయం సాధారణ ప్రజల్లో, అభిమానుల్లో వ్యక్తమైంది. పైగా విజయవాడ నడిబొడ్డున జరిగే సాంస్కృతిక వేదికలకు ఉప ముఖ్యమంత్రి హాజరు కాకపోవడం వెనుక ఏదైనా ప్రోటోకాల్ సమస్య ఉందా లేక రాజకీయ కారణాలు ఉన్నాయా అన్న ప్రశ్నలు సోషల్ మీడియాలో వెల్లువెత్తాయి. ఏపీ సర్కార్ తరఫున మున్సిపల్ మంత్రి నారాయణ, ఇతర అధికారులు ముందుండి కార్యక్రమాలను నడిపించారే తప్ప, పవన్ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు.పవన్ కల్యాణ్ ఈ పర్యటనకు కావాలనే దూరంగా ఉండటం వెనుక ఒక బలమైన రాజకీయ, ఆత్మగౌరవ కోణం దాగి ఉందని జనసేన వర్గాలు చెబుతున్నాయి. విజయ్ గెలుపును నేసోషల్ మీడియా ట్రోలర్లు పవన్ కల్యాణ్‌ను విజయ్‌తో పోల్చుతూ తీవ్రస్థాయిలో కించపరిచే ప్రయత్నం చేశారు. విజయ్ ఏకంగా సొంతంగా అధికారంలోకి వచ్చారని, పవన్ మాత్రం ఇతర పార్టీల పంచన చేరి డిప్యూటీ సీఎం పదవితో సరిపెట్టుకున్నారంటూ నీచమైన పోలికలతో ట్రోలింగ్ వార్ నడిపారు. ఇప్పుడు ఒకవేళ విజయ్‌ను కలవడానికి వెళ్లినా, లేదా పక్కన నిలబడినా.. డిజిటల్ మాధ్యమాల్లో మళ్లీ పనిగట్టుకుని లేనిపోని పోలికలు తెచ్చి వ్యక్తిత్వ హననానికి దిగుతారన్న ముందస్తు అంచనాతోనే పవన్ వ్యూహాత్మకంగా తప్పుకున్నట్లు తెలుస్తోంది.తన ప్రమేయం వల్ల మీడియా ఫోకస్ అసలు చర్చలైన తెలుగుగంగ, గోదావరి?కావేరి జలాల నుంచి పక్కదారి పట్టి.. అనవసరమైన స్టార్ వార్స్ , పొలిటికల్ ట్రోలింగ్‌గా మారకూడదన్న ఉద్దేశంతోనే పవన్ కల్యాణ్ పూర్తి పరిపక్వతతో వ్యవహరించారని భావిస్తున్నారు. ప్రత్యర్థులకు ఎలాంటి రాజకీయ ఆయుధాన్ని చేతికి ఇవ్వకూడదన్న వ్యూహంతోనే ఈ టూర్‌కు పూర్తిగా దూరంగా ఉంటూ, ప్రభుత్వం తరఫున చంద్రబాబు?విజయ్ భేటీ సజావుగా సాగేలా చేశారని అంటున్నారు. ఇద్దరు సౌత్ ఇండియన్ సూపర్ స్టార్లు రాజకీయ వేదికపై ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తారని ఆశపడిన అభిమానులకు నిరాశే మిగిలినప్పటికీ, పవన్ తీసుకున్న ఈ దూరపు నిర్ణయం విమర్శకుల నోళ్లు మూయించేలా వ్యూహాత్మక అడుగుగానే నిలిచిందని అనుకోవచ్చు.

వంగవీటి రాధా మరోసారి రాంగ్ స్టెప్ వేశారా ?



అమరావతి,వంగవీటి రంగా అంటేనే ఒక పాజిటివ్ వైబ్రేషన్. అది ఒక బలమైన సామాజిక వర్గంలో ఆరాధ్యనీయ మైన పిలుపు. కోస్తా జిల్లాలలో రంగా అన్న రెండు అక్షరాలు తారకమంత్రంగా చేసుకుని ముందుకు సాగే జనాభా అత్యధిక శాతం ఉంది. అలాంటి రంగాకు వారసుడు అంటే అది ఒక బ్రాండ్ గానే చూడాలి. వంగవీటి రాధాకృష్ణ రంగా తనయుడిగా రాజకీయాల్లోకి ఇప్పటికి రెండు దశాబ్దాలకు ముందే ప్రవేశించారు. ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన ఆ తరువాత నుంచి మాత్రం రాజకీయ అదృష్టాన్ని అందుకునే విషయంలో వెనకబడ్డారు. దానికి కారణాలు ఎన్నో ఉన్నా ఆయన రాజకీయంగా తీసుకున్న నిర్ణయాలు కొన్ని అలా ప్రభావితం చేశాయని కూడా చెబుతారు. తాజాగా ఆయన టీడీపీ నుంచి జనసేనలోకి మారడంతో కొత్త చర్చకు తెర లేస్తోంది.

ఉన్న చోటుని వీడి :

రాధా రాజకీయ జీవితం చూస్తే ఆయన ఎన్నికల ముందే ఒక పార్టీ నుంచి వేరొక పార్టీలోకి మారుతూ రావడం కనిపిస్తుంది. అది కూడా ఆయన వేసుకున్న అంచనాలేమో కానీ ఆయన డెసిషన్ మాత్రం బూమరాంగ్ అవుతూ వచ్చింది అని గుర్తు చేస్తారు. ఒక్కసారి వెనక్కి వెళ్తే కనుక 2004లో కాంగ్రెస్ తరఫున విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అయిన రాధాకృష్ణ 2009లో మాత్రం మరోసారి ఎమ్మెల్యే కావడం డ్యాం షూర్ గా ఆ పార్టీలో ఉన్నా ప్రజారాజ్యం పార్టీలోకి చేరిపోయారు.అలా 2009లో ఆయన ప్రజారాజ్యం తరఫున విజయవాడ సెంట్రల్ కి పోటీ చేసి పరాజాయం పాలు అయ్యారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ అందుకుని మల్లాది విష్ణు గెలిచారు.

వైసీపీలో సైతం :

ఇక 2014 నాటికి రాధా వైసీపీలో చేరారు. ఆ పార్టీలో అయిదేళ్ళ పాటు ఉండి ఎంతగానో పరిశ్రమించారు. ఇక 2019 ఎన్నికల్లో రాధాకు మచిలీపట్నం ఎంపీ టికెట్ ఇస్తామని వైసీపీ హైకమాండ్ చెప్పింది. కానీ కరెక్ట్ గా ఎన్నికల సమయంలో ఆయన టీడీపీలోకి వెళ్ళిపోయారు. వైసీపీ ప్రభంజనంలో టీడీపీ ఓటమి పాలు అయింది. అదే రాధా వైసీపీలో ఉంటే కచ్చితంగా మంచిలీపట్నం ఎంపీ అయ్యేవారు అని గుర్తు చేస్తున్నారు. ఇక 2024 ఎన్నికల్లో టీడీపీ గెలిచింది. రాధాకు ఎమ్మెల్సీ చేసి మంత్రి పదవి ఇస్తామని చెప్పారు. అంతే కాదు రాజ్యసభ సీటు ఆఫర్ కూడా ఉందని అంటున్నారు. ఇలా భారీ ఆఫర్లే ఆయనకు ఉన్నాయి.

మంత్రిగా ఎదిగేందుకు :

కానీ ఇన్నాళ్ళూ ఎంతో ఓర్పుతో వ్యవహరించిన వంగవీటి సడెన్ గా జనసేనలో చేరిపోయారు. దాంతో ఆయన రాజకీయ జీవితంలో ఇదొక కొత్త మలుపు అని అంటున్నారు. నిజానికి వంగవీటి టీడీపీలోనే కొనసాగి ఉంటే ఒక్క ఏడాది ఆగితే చాలు 2027లో ఏపీలో రెండు పదులకు పైగా ఎమ్మెల్సీ సీట్లు ఖాళీ అవుతాయి. అందులో కచ్చితంగా వంగవీటికి ఒక సీటు ఖాయమని అంటున్నారు. పోనీ కాదూ కూడదు అనుకుంటే 2028లో రాజ్యసభ సీట్లు మరిన్ని వస్తాయి. వాటిలో కూడా అకామిడేషన్ ఉంటుంది. ఇవన్నీ పక్కన పెడితే 2029లో ఎమ్మెల్యేగా టీడీపీ నుంచి చాన్స్ రావచ్చు అన్నది కూడా ఉంది. అలా ఈ సీనియర్ నేత మంత్రిగా ఎదిగేందుకు వీలు ఉంది. కానీ టీడీపీని కాదని వంగవీటి ఇపుడు జనసేనలోకి చేరిపోయారు.

జనసేనలోకి అంటే :

స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఈ కీలక సమయంలో రాధాకృష్ణ జనసేనలోకి వెళ్ళడం చూసిన వారు అభిమానులు అనేది ఒక్కటే మాట ఆయన పార్టీ మారడం అవసరమా అని. ఆయన ఒక రాష్ట్ర స్థాయి నాయకుడుని, జనసేనలోకి వెళ్ళి మేయర్ పదవిని తీసుకుంటే అది ఆయన రాజకీయ జీవితానికి అనుభవానికి ప్రత్యేకించి రంగా అభిమానులకు కూడా ఇబ్బందికరమే అని అంటున్నారు మరి రాధాక్రిష్ణ అయితే జనసేనలో చేరితే దక్కేది ఏమి ఉంటుంది అంటే ఆయన విజయవాడ మేయర్ గా ఆయన పోటీ చేస్తారు అని ప్రచారం అయితే పెద్ద ఎత్తున సాగుతోంది. ఇటీవల రాధాకృష్ణ మంగళగిరి ఆఫీసుకు వెళ్ళి పవన్ కళ్యాణ్ ని కలుసుకున్నారు. ఇది మర్యాదపూర్వకమైన భేటీ అని చెబుతున్నా అనాడే ఆయన పార్టీ మారు మీద గుసగుసలు వినిపించాయి. ఇపుడు చూస్తే పవన్ కళ్యాణ్ సమక్షంలో రాధా పార్టీలో ఆయన చేరిపోయారు.

టీడీపీలో ఉంటేనే :

ఇక రాధా పార్టీ మారడం మీద అయితే రకరకాలైన చర్చ అయితే సాగుతోంది. ఆయన టీడీపీని అట్టేబెట్టుకుని ఉంటేనే బాగుంటుంది అన్నది పలువురు నుంచి వస్తున్న సూచన. రానున్న రోజులలో ఆయన స్థాయికి తగిన పదవి లభిస్తుందని మంత్రి యోగం కూడా అదే పార్టీలో దక్కే చాన్స్ ఉందని అంటున్నారు. అయితే విజయవాడ రాజకీయ సమీకరణలు, సామాజిక అంశాలు వంగవీటి కుటుంబం

వ్యక్తిగత శత్రువులు ..రాజకీయాల్లో ప్రత్యర్థులు

హైదరాబాద్ ,తెలంగాణ రాజకీయాల్లో రోజురోజుకూ ప్రజా సమస్యల ప్రాతిపదికన జరగాల్సిన చర్చలు కనుమరుగవుతూ, వ్యక్తిగత దూషణలు, వ్యక్తిత్వ హనన డిజిటల్ దాడులే ప్రధాన ఎజెండాగా మారుతున్నాయి. ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్షాల మధ్య సిద్ధాంతపరమైన విభేదాలు, ప్రజా విధానాలపై ఆరోగ్యకరమైన విమర్శలు ఉండటం సహజం. అయితే, ప్రస్తుత తెలంగాణ రాజకీయ వాతావరణం ప్రజా సమస్యలను పక్కనపెట్టి, నాయకుల వ్యక్తిగత జీవితాలు, ఆరోగ్యం, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని సాగిస్తున్న క్యారెక్టర్ అస్సాసినేషన్ సంస్కృతికి అద్దం పడుతోంది.బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనకు అస్వస్థత, జ్వరం కారణంగా రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకుంటున్నట్లు, అందుబాటులో ఉండటం లేదని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. అయితే, ఒక నాయకుడి అనారోగ్యంపై సానుభూతి ప్రదర్శించాల్సింది పోయి, ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు, సోషల్ మీడియా విభాగం నేతలు దాని వెనుక ఏదో రహస్య కారణం ఉందంటూ కథనాలు అల్లడం మొదలుపెట్టారు. దర్యాప్తు సంస్థల భయం వల్లే ఆయన అనారోగ్యం డ్రామా ఆడుతున్నారంటూ రకరకాల ఊహాగానాలతో ప్రచారం చేయడం రాజకీయ నైతికత ఏ స్థాయికి దిగజారిందో చాటిచెప్పింది.అదే సమయంలో, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బిఆర్ఎస్ సానుభూతిపరులు, కాంగ్రెస్ వ్యతిరేకులు డిజిటల్ హ్యాండిల్స్ సాగిస్తున్న ప్రచారం కూడా హద్దులు దాటుతోంది. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి వ్యక్తిగత జీవితంపై అసభ్యకరమైన పోస్టులు పెట్టడం, మార్ఫింగ్ ఇమేజ్‌లు, వికృతమైన కంటెంట్‌ను వ్యాప్తి చేయడం పరిపాటిగా మారింది. ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో జుగుప్సాకర వ్యాఖ్యలు చేశారంటూ ఇప్పటికే సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్లలో పలు కేసులు సైతం నమోదయ్యాయి. న్యాయపరమైన చర్యలు హెచ్చరిస్తున్నప్పటికీ, డిజిటల్ వేదికలపై వైరం ఏమాత్రం తగ్గడం లేదు.ఈ రకమైన డిజిటల్ యుద్ధానికి ప్రధాన కారణం ఇరు పార్టీల సోషల్ మీడియా ఆర్మీలు నిర్వహిస్తున్న శైలేనని భావిస్తున్నారు. యూట్యూబ్ ఛానెళ్లు, ఎక్స్ , ఫేస్‌బుక్ , వాట్సాప్ గ్రూపుల ద్వారా కంటెంట్‌ను వైరల్ చేసే క్రమంలో లైకులు, వ్యూస్, రాజకీయాధిపత్యం కోసం ప్రత్యర్థులపై అత్యంత నీచమైన పదజాలాన్ని ఉపయోగిస్తున్నారు. పాలనాపరమైన లోపాలు, విద్యుత్ సంక్షోభం, నిరుద్యోగం, ధరణి లేదా హైడ్రా వంటి ప్రజా సమస్యలపై చర్చించాల్సిన చోట, నాయకుల వ్యక్తిగత బలహీనతలు లేదా వ్యక్తిగత జీవితాలే డిజిటల్ వేదికల్లో ప్రధాన అంశాలుగా మారుతున్నాయి. తెలంగాణ సమాజం చైతన్యవంతమైన రాజకీయ పోరాటాలకు నిలయం. ఉమ్మడి రాష్ట్రంలో హుందాగా సాగిన సిద్ధాంత రాద్ధాంతాలు, హక్కుల పోరాటాల స్థానంలో ఇప్పుడు క్షుద్ర రాజకీయాలు చోటుచేసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకే చేటు తెస్తోంది. నాయకుల మధ్య శత్రుత్వం కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా వ్యక్తిగత కక్ష సాధింపుగా రూపాంతరం చెందుతుండటంతో, ద్వితీయ శ్రేణి కార్యకర్తలు కూడా క్షేత్రస్థాయిలో పరస్పరం దాడులకు తెగబడే వాతావరణం ఏర్పడుతోంది. ఈ ధోరణికి తక్షణమే అడ్డుకట్ట పడకపోతే, ప్రజా సమస్యలు గాలికి కొట్టుకుపోయి కేవలం బురదజల్లుడు రాజకీయాలే రాజ్యమేలుతాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. తమ పార్టీ సోషల్ మీడియా విభాగాలను అదుపులో ఉంచుకోవాల్సిన ప్రాథమిక బాధ్యత అగ్రనాయకత్వానిదే. వ్యక్తిగత దూషణలను, వికృతమైన డిజిటల్ పోస్టులను ఖండిస్తూ సీనియర్ నేతలు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసినప్పుడే తెలంగాణ రాజకీయాల్లో పోగొట్టుకున్న హుందాతనాన్ని మళ్లీ పునరుద్ధరించడం సాధ్యమవుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

హోటీకేకుల్లా విశాఖ ఉక్కు ప్లాట్ల అమ్మకం

విశాఖపట్నం,ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి ఆస్తుల విక్రయ ప్రక్రియ ఊరటనిస్తోంది. నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విశాఖ నగరంలోని ప్రముఖ ప్రాంతాలలో ఉన్న ప్లాట్ల ఈ-వేలానికి రియల్ రంగం నుంచి ఊహించని స్థాయి స్పందన లభించింది. ముఖ్యంగా నగరంలోని వ్యూహాత్మక ప్రాంతమైన హెచ్‌బీ కాలనీలో స్టీల్ ప్లాంట్‌కు చెందిన నిరుపయోగ భూముల విక్రయం కోసం నిర్వహించిన తొలి విడత ఆన్‌లైన్ వేలం ప్రక్రియ అత్యంత విజయవంతంగా ముగిసింది.తొలి విడతలో భాగంగా ఉంచిన ప్లాట్లను సొంతం చేసుకునేందుకు కొనుగోలుదారులు పోటీపడ్డారు. అధికారిక సమాచారం ప్రకారం, మొత్తం 150 ప్లాట్లను విజయవంతంగా విక్రయించగా, దీని ద్వారా ఏకంగా రూ. 366 కోట్లకు పైగా భారీ ఆదాయం సమకూరింది. మేనేజ్‌మెంట్ అంచనా వేసిన అంచనా ఆదాయం కంటే ఈ మొత్తం గణనీయంగా ఎక్కువగా ఉంది . విశాఖ నగరంలో రియల్ ఎస్టేట

హైదరాబాద్ మెట్రో అనాథ !

హైదరాబాద్ ,దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ, వ్యాపార హబ్‌గా అంతర్జాతీయ గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరం.. మెట్రో రైలు నెట్‌వర్క్ విస్తరణ విషయంలో మాత్రం ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే వెనుకబడిపోతోంది. ఢిల్లీ 390 కిలోమీటర్లకు పైగా ట్రాక్‌తో దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాలు వేల కోట్ల కేంద్ర నిధులతో తమ రెండో, మూడో దశ పనులను శరవేగంగా పట్టాలెక్కిస్తున్నాయి. కానీ భాగ్యనగరంలో మొదటి దశ 69 కిలోమీటర్ల మేర పూర్తయి ఏళ్లు గడుస్తున్నా, రెండో దశ విస్తరణ మాత్రం ఫైళ్ల దశను దాటి పూర్తిస్థాయిలో పట్టాలెక్కలేదు. కొన్నేళ్లుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ. 38 వేల కోట్లకు పైగా అంచనాతో 122 కిలోమీటర్ల పైబడిన ఫేజ్-2 డీపీఆర్‌లను కేంద్రానికి సమర్పిస్తున్నప్పటికీ.. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నుంచి రావాల్సిన కీలక ఆమోదాలు, నిధుల భాగస్వామ్యంపై ఏకాభిప్రాయం రావడం లేదు. ఉత్తరాది నగరాల ప్రాజెక్టులకు, మహారాష్ట్ర, గుజరాత్ మెట్రో నెట్‌వర్క్‌లకు కేంద్ర బడ్జెట్‌లలో వేల కోట్ల రూపాయలను కేటాయిస్తున్న మోదీ సర్కార్.. దేశానికే భారీగా పన్నులు చెల్లిస్తున్న హైదరాబాద్ మెట్రో విషయానికి వచ్చేసరికి మాత్రం కొర్రీలు పెడుతూ జాప్యం చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.హైదరాబాద్‌కు గనక సమగ్రమైన ప్రజా రవాణా మౌలిక సదుపాయాలు అందితే.. అది ముంబై, బెంగళూరులను సైతం వెనక్కి నెట్టి దేశంలోనే అగ్రగామి నగరంగా అవతరిస్తుందన్న వాస్తవం కేంద్ర పెద్దలకు తెలియంది కాదు. తక్కువ జీవన వ్యయం, మెరుగైన శాంతిభద్రతలు, ఐటీ-ఫార్మా రంగాల్లో అపార అవకాశాలు ఉన్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను అధిగమించేలా మెట్రో పూర్తయితే అంతర్జాతీయ పెట్టుబడులన్నీ ఇక్కడికే పోటెత్తుతాయి. అందుకే, ఇతర రాష్ట్రాల నగరాల పోటీతత్వాన్ని కాపాడేందుకు హైదరాబాద్‌పై ఆర్థిక, మౌలిక వసతులపరమైన అంక్షలు పరోక్షంగా అమలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.రాజకీయ నాయకత్వ బలహీనతలు, కేంద్ర వివక్ష కారణంగా అంతిమంగా నష్టపోతున్నది సామాన్య హైదరాబాద్ పౌరుడే. ట్రాఫిక్ రద్దీతో నిత్యం నరకం చూస్తున్న ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్యులు మెట్రో విస్తరణ కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. కేంద్రం హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు కేంద్రం తక్షణమే సంపూర్ణ అనుమతులు మంజూరు చేసి, తన వాటా నిధులను విడుదల చేయాల్సిన చారిత్రక అవసరం ఉంది. లేకపోతే దేశానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న మహానగరానికి అన్యాయం చేసినట్లే అవుతుంది.

మొజాంజాహీ మార్కెట్ సమీపంలో 35 అంతస్తుల భవన

హైదరాబాద్ ,హైదరాబాద్ నగర చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచే మొజాంజాహీ మార్కెట్ సమీపంలో 35 అంతస్తుల భారీ ఆకాశహర్మ్యం నిర్మాణానికి అనుమతులు ఇవ్వడంపై తెలంగాణ హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అబిడ్స్ సమీపంలోని గన్‌ఫౌండ్రీ పరిధిలో మీనాక్షి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టిన మీనాక్షి ఎలీసియా ప్రాజెక్టు చట్టబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. సొసైటీ ఫర్ క్రూసేడ్ అగైనెస్ట్ కరప్షన్ దాఖలు చేసిన ఈ ప్రజాహిత వ్యాజ్యంలో.. 2022 ఆగస్టు 23న జారీ చేసిన భవన నిర్మాణ అనుమతి నిబంధనలకు విరుద్ధంగా ఉందని, అవసరమైన చట్టపరమైన ప్రక్రియలను పాటించకుండానే అధికారులు అనుమతులు ఇచ్చేశారని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు.ఈ విచారణ సందర్భంగా భవనం ఎత్తు, నిర్మాణ విస్తీర్ణంపై న్యాయస్థానం ఆరా తీసింది. ఈ ప్రాజెక్టులో 2 సెల్లార్ లెవల్స్, మరో 5 ప్రత్యేక లెవల్స్‌తో పాటు ఏకంగా 35 అంతస్తుల నిర్మాణం జరుగుతోందని తెలియడంతో ధర్మాసనం నివ్వెరపోయింది. శతాబ్దాల చరిత్ర కలిగిన మొజాంజాహీ మార్కెట్ వంటి హెరిటేజ్ నిర్మాణాల పరిసరాల్లో ఇంతటి భారీ ఎత్తుగల కట్టడానికి అధికారులు ఏ ప్రాతిపదికన అనుమతులు మంజూరు చేశారంటూ న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆధునిక ఆకాశహర్మ్యాల వల్ల పురాతన చారిత్రక కట్టడాల ఉనికి కనుమరుగైపోతోందని, హెరిటేజ్ ల్యాండ్‌మార్క్‌లను పూర్తిగా కప్పివేసేలా అధిక అంతస్తుల భవనాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వెనుక హేతుబద్ధత ఏమిటని జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. చారిత్రక ప్రాధాన్యత ఉన్న ప్రాంతాల్లో భవిష్యత్తు తరాలకు వారసత్వ సంపదను కాపాడాల్సిన బాధ్యతను కోర్టు గుర్తుచేసింది.అయితే, డెవలపర్ తరఫున హాజరైన న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జీహెచ్ఎంసీ సహా సంబంధిత అన్ని ప్రభుత్వ విభాగాల నుంచి తాము అవసరమైన నిరభ్యంతర పత్రాలు , చట్టబద్ధమైన అనుమతులు తీసుకున్న తర్వాతే పనులు చేపట్టామని స్పష్టం చేశారు. దీనికి ప్రతిగా పిటిషనర్ న్యాయవాది బదులిస్తూ.. బిల్డర్ దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ కేవలం ఆరోపణలను ఖండించడానికి మాత్రమే పరిమితమైందని, ప్రాజెక్టు వల్ల తలెత్తే తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు, భద్రతా ప్రమాదాలు, నిర్మాణ నిబంధనల ఉల్లంఘనలపై ఎటువంటి సరైన సమాధానం ఇవ్వలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అన్ని నిబంధనలు పూర్తిగా నెరవేరే వరకు నిర్మాణంపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఇదే సమయంలో, సదరు ప్రాజెక్టుపై ఇలాంటి ఆరోపణలతోనే గతంలో దాఖలైన మరో పిటిషన్ కూడా న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉందని డెవలపర్ కౌన్సిల్ కోర్టుకు తెలియజేస్తూ, ఆ రెండు అంశాలను కలిపి విచారించాలని విజ్ఞప్తి చేశారు. ఆ రెండో పిటిషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి సమగ్ర వాదనలు వినిపించేందుకు పిటిషనర్ తరఫు న్యాయవాది గడువు కోరారు. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను నమోదు చేసుకున్న హైకోర్టు బెంచ్.. ఆ పెండింగ్ కేసు నంబరు, వివరాలను జాబితా చేయాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.

కనకదుర్గ అమ్మవారికి రూ. 75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం బహూకరణ

ఇంద్రకీలాద్రి,శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల వేళ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారికి గురువారం ఉదయం విశేష స్వర్ణ కానుక సమకూరింది. శ్రీకాకుళం పట్టణానికి చెందిన భక్తులు కూర్మినాయుడు, పద్మావతమ్మ దంపతుల కుమారుడు . దుర్గా శ్రీనివాస్ అమ్మవారికి సుమారు రూ. 75 లక్షల విలువైన దివ్య స్వర్ణ కిరీటాన్ని భక్తిప్రపత్తులతో సమర్పించారు. ?ఎరుపు, నీలం, తెలుపు, పచ్చ రాళ్లతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన 494 గ్రాముల బరువు గల ఈ నవరత్న ఖచిత బంగారు కిరీటాన్ని దాతలు ఆలయ అధికారులకు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారివి.కె. శీనా నాయక్, దసరా చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ వి. త్రినాథరావు సంయుక్తంగా ఈ కానుకను స్వీకరించారు. ?అనంతరం దాత కుటుంబ సభ్యులకు అంతరాలయంలో శ్రీ అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేద పండితులు వారికి వేదాశీర్వచనం పలకగా, అధికారులు శ్రీ అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.?ఈ సందర్భంగా దాత కె. దుర్గా శ్రీనివాస్ మాట్లాడుతూ.. లోకపావని అయిన కనకదుర్గమ్మ దయవల్లే తాము ఈ కానుకను సమర్పించుకోగలిగామని, పవిత్రమైన దసరా శరన్నవరాత్రుల పర్వదినాల్లో అమ్మవారికి స్వర్ణ కిరీటం బహూకరించే భాగ్యం కల్పించినందుకు ఆలయ ఈవో కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ?

జొనూ! ఇంతకూ గు'లాబీ' తోటలో ఏం నడుస్తోంది?..

సిద్ధిపేట : జొనూ..! ఇంతకూ గులాబీ తోటలో ఏం నడుస్తోంది..? గులాబీ దళంలో సీఎం కుర్చీ లొల్లి ఏమైనా మొదలైందా? దీని కోసం పకడ్బందీగా కొత్త వ్యూహానికి ఏమైనా తెరలేచిందా..? అధినేత కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధిపేట జిల్లా గజ్వేల్ గడ్డపైనే 'సీఎం కేటీఆర్.. సీఎం కేటీఆర్..' అంటూ నినాదాలు మార్మోగడం వెనుక అంతరార్థమేమిటి..? కేటీఆర్ సమక్షంలోనే పార్టీ శ్రేణులు ముఖ్యమంత్రి నినాదాలతో హోరెత్తిస్తుంటే..కేటీఆర్ మాత్రం మౌనంగా ఉండటంలో అంతర్యమేమిటి..? ఇదంతా యాదృచ్ఛికమా..? లేక గులాబీ పార్టీలో భవిష్యత్ నాయకత్వానికి సంబంధించి సాగుతున్న అంతర్గత రాజకీయాలకు సంకేతమా..? పార్టీలో తనయ కవితకు ఒక న్యాయం, తనయుడు కేటీఆర్‌కు మరో న్యాయమా? పార్టీకి, కేసీఆర్ కొరకు తన యవ్వనం మొత్తాన్ని ధారబోసిన సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు భవితవ్యం ఏంటీ? అని ఇప్పుడు గులాబీ దళంలో మొత్తంగా వినిపిస్తున్న మాట, ఆసక్తికరమైన చర్చ కూడా ఇదే. సిద్ధిపేట జిల్లానే కాకుండా, యావత్ తెలంగాణ రాజకీయ వర్గాల్లోనూ ఇప్పుడు ఇదే హాట్ టాపిక్!

కేసీఆర్ ఇలాకలోనే కేటీఆర్‌కు సీఎం నినాదాలు!

సింగరేణి కార్మిక గర్జన బహిరంగ సభకు హాజరయ్యేందుకు బుధవారం గోదావరిఖనికి బయలుదేరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుకు మాజీ ముఖ్యమంత్రి, గులాబీ అధినేత కేసీఆర్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధిపేట జిల్లాలోని గజ్వేల్ మండలం రిమ్మనగూడలోని ఎస్4 ప్రైవేట్ హోటల్ వద్ద పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. గజ్వేల్ నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి కేటీఆర్‌ను శాలువాలతో సత్కరించి, గులాబీ పూలతో అభివాదం చేశారు. అయితే, ఈ స్వాగత కార్యక్రమంలో అందరి దృష్టినీ ఆకర్షించింది పూలవర్షమో.. నాయకుల సందడో కాదు! 'సీఎం కేటీఆర్.. సీఎం కేటీఆర్..' అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలే! కేసీఆర్ రాజకీయ కంచుకోటగా భావించే గజ్వేల్ నియోజకవర్గంలో, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న గడ్డపైనే కేటీఆర్‌ను ముఖ్యమంత్రిగా సంబోధిస్తూ నినాదాలు చేయడం రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. కేటీఆర్ ఈ మార్గంలో ప్రయాణించడం ఇదేమీ కొత్తేమీ కాదు. గతంలోనూ పలుమార్లు ఈ ప్రాంతం మీదుగా వెళ్లారు. కానీ, ఈసారి ఘనస్వాగతం, గులాబీ పూల వర్షం, అందునా 'సీఎం కేటీఆర్' నినాదాలు ప్రత్యేక చర్చకు దారితీశాయి. ఈ పరిణామాలను రాజకీయ పరిశీలకులు ఎలా విశ్లేషిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

ఓ పక్క కేసీఆరే సీఎం.. మరోపక్క కేటీఆర్‌కు జై!

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని కేటీఆర్, హరీశ్‌రావు పలుమార్లు చెబుతున్న రాజకీయ సందేశం ఒకవైపు వినిపిస్తుండగా.. మరోవైపు కేటీఆర్ ఎదుటే ఆయనను ముఖ్యమంత్రిగా చూడాలంటూ పార్టీ శ్రేణులు నినదించడం చర్చనీయాంశమైంది. 'కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాకనే అసెంబ్లీలో అడుగుపెడతారు' అన్న రాజకీయ వాదన ఒకవైపు.. 'సీఎం కేటీఆర్' నినాదాలు మరోవైపు! ఈ రెండు పరిణామాల మధ్య బీఆర్ఎస్ భవిష్యత్ నాయకత్వంపై స్పష్టత ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఒకవేళ వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి పీఠంపై కూర్చునేది కేసీఆరా..? కేటీఆరా..? ఇప్పటివరకు కేసీఆర్ నాయకత్వంలోనే పార్టీ ఎన్నికల బరిలోకి దిగుతుందన్న సంకేతాలు వినిపిస్తుండగా.. కేటీఆర్ నాయకత్వానికి అనుకూలంగా నినాదాలు రావడం భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై ఊహాగానాలకు తావిస్తోంది. అయితే, ఈ నినాదాలే నాయకత్వ మార్పునకు సంకేతమనే వాదనలకు బలం చేకూర్చే విధంగా ఉన్నాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

కేటీఆర్ ముసిముసి నవ్వులు.. మళ్లీ వస్తానని హామీ!

కార్యకర్తల నినాదాల మధ్య కేటీఆర్ అభివాదం చేస్తూ, నాయకులతో ముచ్చటిస్తూ, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. 'మళ్లీ ఒకసారి గజ్వేల్‌కు వస్తా.. ఒక రోజంతా మీతోనే ఉంటా' అంటూ పార్టీ శ్రేణులకు హామీ ఇచ్చారు. దీంతో కార్యకర్తలు మరింత ఉత్సాహంగా 'సీఎం కేటీఆర్.. సీఎం కేటీఆర్..' అంటూ నినాదాలు చేశారు. కేటీఆర్ ఈ నినాదాలను వారించకపోవడం, పైగా మరోసారి గజ్వేల్‌కు వస్తానని చెప్పడం రాజకీయంగా చర్చకు కారణమైంది. అయితే, ఆయన స్పందనను భవిష్యత్ నాయకత్వంపై ఇచ్చిన సంకేతంగా భావించాలా?



లేక కార్యకర్తల ఉత్సాహానికి ఇచ్చిన సాధారణ ప్రతిస్పందనగానే చూడాలా? అన్నది స్పష్టత రావాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో పార్టీలో ట్రబుల్‌షూటర్‌గా పేరున్న సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు గట్టి అనుచరులు, మద్దతుదారులుగా పేరున్న గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, నూనె కుమార్ యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్‌కర్ పద్మాబాయి నర్సింగరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్తాతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం గమనార్హం.

యవ్వనం మొత్తాన్ని అంకితం చేసిన హరీశ్‌రావు సంగతేంటి?

ఈ రాజకీయ చర్చలో మరో కీలకమైన ప్రశ్న సిద్ధిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ట్రబుల్ షూటర్ తన్నీరు హరీశ్‌రావు భవిష్యత్తు! పార్టీ కోసం తన రాజకీయ జీవితాన్ని అంకితం చేసిన నాయకుడిగా, క్షేత్రస్థాయిలో బలమైన అనుచరగణం కలిగిన నేతగా హరీశ్‌రావుకు ఇంటా, బయటా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఒకవేళ కేసీఆర్ తన రాజకీయ వారసుడిగా కేటీఆర్‌ను ముందుకు తీసుకొస్తే.. హరీశ్‌రావు పాత్ర ఏమిటి? పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ఆయనకు ఎలాంటి బాధ్యతలు దక్కుతాయి? ముఖ్యమంత్రి పదవి విషయంలో భవిష్యత్తులో ఏమైనా కొత్త సమీకరణాలు తెరపైకి వస్తాయా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్నాయి. గజ్వేల్ గడ్డ రిమ్మనగూడలో పార్టీ శ్రేణులు కేటీఆర్ సీఎం అంటూ నినాదాలు చేసినట్లుగా కేసీఆర్ రాజకీయ వారసత్వంగా కేటీఆర్ వస్తే... పార్టీకి, కేసీఆర్ కొరకు తన యవ్వనం మొత్తాన్ని ధారబోసిన హరీశ్‌రావు భవితవ్యం ఏంటనే ప్రశ్న స్వతాహాగా గులాబీ శ్రేణుల్లో వ్యక్తమవుతుంది. అంతేకాదు, రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిగా ఉన్న తన అభిమానులు, కార్యకర్తల్లో తమ నేతకు అన్యాయం జరుగుతుందా?అనే గుబులు మొదలవడమే కాకుండా, అది అటు తిరిగి, ఇటు తిరిగి పార్టీకి నష్టం చేస్తుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

గులాబీ తోటలో ఏదైనా కొత్త వ్యూహమా?

గజ్వేల్‌లో కేటీఆర్‌కు లభించిన స్వాగతం, 'సీఎం కేటీఆర్' నినాదాలు సాధారణ రాజకీయ సందడిని మించి చర్చకు దారితీశాయి. ఇవి కార్యకర్తల వ్యక్తిగత అభిమానానికి ప్రతిరూపమా? కేటీఆర్ నాయకత్వాన్ని ముందుకు తీసుకురావాలన్న వర్గాల ఆకాంక్షకు ప్రతిబింబమా? లేక బీఆర్ఎస్ భవిష్యత్ నాయకత్వంపై పార్టీలో సాగుతున్న సహజమైన చర్చకు బహిరంగ రూపమా? అన్నదానిపై వాడి వేడిగా, ఆసక్తికరమైన కొత్త చర్చ నడుస్తోంది. ప్రస్తుతానికి ఈ పరిణామాల వెనుక ప్రత్యేక వ్యూహం ఉండకపోయినప్పటికీ, కేసీఆర్ ఇలాకలోనే కేటీఆర్‌కు సీఎం నినాదాలు రావడం రాజకీయంగా విస్మరించలేని పరిణామమని రాజకీయ పరిశీలకులు, విశ్లేషకులు అభిప్రాయాన్ని, అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి.. గులాబీ తోటలో సీఎం కుర్చీ చుట్టూ చర్చ మొదలైందా? కేసీఆర్ నాయకత్వమే కొనసాగుతుందా? కేటీఆర్ కోసం మార్గం సిద్ధమవుతోందా? ఈ ఇద్దరి మధ్య హరీశ్‌రావు రాజకీయ ప్రస్థానం ఎలా సాగనుంది? అనే కొత్త చర్చకు మాత్రం తెరలేపినట్లయింది. అయితే, వీటన్నింటకి సమాధానాలు ఇప్పుడే దొరకకపోవచ్చు. కానీ, రిమ్మనగూడలో మార్మోగిన 'సీఎం కేటీఆర్' నినాదాలు మాత్రం గులాబీ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. తెరపై కనిపించింది స్వాగత కార్యక్రమమే.. తెరవెనుక ఏమైనా రాజకీయ లెక్కలు ఉన్నాయా అన్నది రాబోయే పరిణామాలే తేల్చాలి! చూడాలి మరి!

బతుకమ్మ పండుగలో.. కనుమరుగవుతున్న జానపద సొబగులు!



హైదరాబాద్,ప్రకృతిని పరమాత్మగా భావించి, పూలనే దైవంగా పూజించే అద్భుతమైన సాంస్కృతిక వైభవం మన తెలంగాణ సొంతం. అందులోనూ బతుకమ్మ పండుగ కేవలం ఒక వేడుక మాత్రమే కాదు.. అది ఈ గడ్డ అస్తిత్వం, శ్రమజీవుల ఆత్మగౌరవం, చెరువుల సంరక్షణ, ఆడబిడ్డల అనుబంధాల కలబోత. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ పూల పండగలో పల్లెపల్లెనా ఒక వినూత్నమైన చైతన్యం వెల్లివిరుస్తుంది.అయితే, నేటి ఆధునిక సమాజంలో ఈ విశిష్టమైన సంస్కృ తి తన అసలు రూపాన్ని కోల్పోతోంది. నాడు పల్లె గుండె ల్లోంచి ఉబికివచ్చిన బతుకమ్మ పాటలు, నేడు పట్టణాల వాణిజ్యీకరణ కోరల్లో చిక్కి విలవిలలాడుతున్నాయి.

గాజుల సవ్వడి ఎక్కడ..?

ఒకప్పుడు బతుకమ్మ పండుగ అంటేనే ఆత్మీయతల సమ్మేళనం. గౌరమ్మను మధ్యలో ఉంచి, చుట్టూ చేరిన ఆడపడుచులు లయబద్ధంగా వేసే అడుగులు, వారి చేతుల గాజుల సవ్వడి, అందరూ కలిసి కొట్టే చప్పట్ల శబ్దమే ఆ పండుగకు అసలైన సంగీతం. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ సాగే పాటల్లో ఒక లయ, ఒక రాగం, గుండెలను హత్తుకునే ఒక సహజ సిద్ధమైన మ్యూజిక్ ఉండేది. ఆ చప్పట్ల శబ్దం వెనుక సమాజంలోని ఐక్యత వినిపించేది. ఆ గాజుల సవ్వడి వెనుక తోబుట్టువుల అనురాగం ప్రతిధ్వనించేది. కానీ నేడు ఆ ప్రాకృతిక సంగీతం పూర్తిగా కనుమరుగైపోతోంది.

డీజేల హోరు.. బతుకమ్మ ఉనికికే ముప్పు!

నేడు బతుకమ్మ వేదికల వద్దకు వెళ్తే వినిపిస్తున్నది అమ్మలక్కల ఆత్మీయ గొంతుకలు కావు.. చెవులు చిల్లులు పడేలా వినిపించే డీజేల చప్పుళ్ళు.. సంప్రదాయ పాటల స్థానంలో అర్థంపర్థం లేని సినిమా రికార్డింగ్ డాన్సుల పాటలు, ఫాస్ట్ బీట్ డీజే మిక్స్‌లు వచ్చి చేరాయి.. మైకుల హోరులో అసలైన బతుకమ్మ ఆత్మ కొట్టుకుపోతోంది. ఒక సంస్కృతిని సజీవంగా ఉంచేది దాని వెనుక ఉన్న మౌఖిక సాహిత్యం. కానీ నేటి తరం యువతకు ఆ పాత పాటలు రావడం లేదు, పాడే ఓపికా ఉండటం లేదు. పెన్ డ్రైవ్‌లలో, స్మార్ట్‌ఫోన్‌లలో డీజే బటన్ నొక్కితే చాలు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.. ధ్వని కాలుష్యాన్ని పెంచే ఈ డీజేల హోరులో తెలంగాణ సంస్కృతి సన్నని గాత్రం నలిగిపోతోంది.

బతుకమ్మ వెనుక దాండియా ఆటా?

ప్రస్తుతం తెలంగాణలో కనిపిస్తున్న అత్యంత విచారకరమైన పరిణామం బతుకమ్మ పండుగలో దాండియా ఆటలు ఆడటం. గుజరాతీ సంస్కృతికి చెందిన నవరాత్రి నృత్యమైన దాండియాను తీసుకొచ్చి, మన బతుకమ్మ వేదికల మీద రుద్దడం ఏ రకమైన ఆధునికత? బతుకమ్మ చుట్టూ తిరుగుతూ, వంగి లేస్తూ, లయబద్ధంగా చప్పట్లు కొట్టే విశిష్ట నృత్య శైలి తెలంగాణ సొంతం. ఆ నృత్యంలో ఒక శరీరక వ్యాయామం, ఒక గ్రేస్, ఒక ఆత్మీయత ఉంటాయి.. దాన్ని వదిలేసి, చేతిలో కర్రలు పట్టుకుని దాండియా ఆడటం ద్వారా మనం మన అస్తిత్వాన్ని మనమే కాలరాసుకుంటున్నాం. పండుగ స్వరూపాన్నే మార్చేసే ఇలాంటి ధోరణులు సమాజానికి క్షేమకరం కాదు.

పెద్దలను అడిగి తెలుసుకోండి!

ఇప్పటికైనా మించిపోయింది లేదు. నా తెలంగాణ ఆడపడుచులు, ము ఖ్యంగా నేటి తరం యువతులు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలి. బతుకమ్మ పండుగ అసలైన విశిష్టత ఏమిటో, నాడు ఎలా జరుపుకునేవారో మీ ఇంట్లో ఉన్న అమ్మమ్మలను, నాన్నమ్మలను, పెద్దవాళ్ళను అడిగి తెలుసుకోండి. గుణబాణాలు నేర్చుకోండి. ఏ పూలతో బతుకమ్మ ను పేర్చాలో, ఏ ఏ రోజు ఏ నైవేద్యం (సద్దులు) సమర్పించాలో, ఏ ఏ పాటలు పాడాలో వారిని అడిగి మరీ పద్ధతిగా తెలుసుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉంది. మన పెద్దల అనుభవంలో ఉన్న ఆ సాంస్కృతిక నిధిని మనం అందుకోవాలి. కేవలం రీల్స్ కోసమో, ఇన్‌స్టాగ్రామ్ ఫోటోల కోసమో పండుగలను వాడుకోవడం మానేసి, పండుగలోని అంతరార్థాన్ని గ్రహించాలి.

దాండియా సంస్కృతిని విడనాడదాం!

ఆధునికత పేరుతో వస్తున్న విపరీత పోకడలను మనం తిప్పికొట్టాలి.. తెలంగాణ గడ్డపై బతుకమ్మ మాత్రమే వెలగాలి కానీ పరాయి దాండియా ఆటలు కాదు. ఈ దాండియా సంస్కృతిని, కర్ణ కఠోరమైన డీజే చప్పుళ్ళను తక్షణమే విడనాడాలి. సహజమైన చప్పట్లతో, గాజుల గలగలలతో, మధురమైన జానపద గొంతుకలతో మన వీధులు మార్మోగాలి. ప్రకృతిని ప్రేమించే ఈ అద్భుత పండుగను దాని సహజ సిద్ధమైన పవిత్రతతోనే ఉంచు దాం. మన అస్తిత్వాన్ని కాపాడుకోవడం అంటే మనల్ని మనం కాపాడుకోవడమే. ఇప్పటికైనా తెలంగాణ సమాజం మేల్కొని, బతుకమ్మ పండుగను దాని అసలు సిసలైన తెలంగాణ పద్ధతిలోనే

చందర్లపాడు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

చందర్లపాడు: మండలంలోని ప్రతి గ్రామం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. చందర్లపాడు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆమె నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు.56 బూత్‌లలో 5,027 ఓట్ల ఆధిక్యం.. కార్యకర్తల సమష్టి కృషికి నిదర్శనంగత అసెంబ్లీ ఎన్నికల్లో చందర్లపాడు మండలంలోని 56 బూత్‌లలో 5,027 ఓట్ల ఆధిక్యాన్ని అందించడం ఒక్కరి విజయమో కాదని, ప్రతి గ్రామంలో ప్రతి గడపను పలకరిస్తూ, పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడిన నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి ఫలితమని తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. గత రెండేళ్లలో తల్లికి వందనం, పెంచిన పింఛన్లు, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించడంలో కార్యకర్తల పాత్ర అభినందనీయమన్నారు. గ్రామాల్లో రోడ్లు, వ్యవసాయ విద్యుత్, వైద్య సదుపాయాలు, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి ప్రజా సమస్యల పరిష్కారంలోనూ కార్యకర్తలు తనకు అండగా నిలుస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు.కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం మళ్లీ ప్రగతి బాటలోముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిబద్ధత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆమె అన్నారు. తల్లికి వందనం, రూ.4,000 పింఛను, అన్నదాత సుఖీభవ, దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు భోజన సదుపాయం వంటి కార్యక్రమాలు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా చేపట్టిన చర్యలని వివరించారు.వేదాద్రి?కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు రూ.15 కోట్లునందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లోని 37 గ్రామాలకు, 17 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించే లక్ష్యంతో ఉన్న వేదాద్రి?కంచల ఎత్తిపోతల పథకం గత ఐదేళ్లలో నిర్వహణ లోపంతో నిర్లక్ష్యానికి గురైందని సౌమ్య గారు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పథకం పునరుద్ధరణ కోసం ము

మంత్రివర్గం రేసులో మహిళా నేత.. లక్కు చిక్కేనా ..!



అమరావతి,బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇస్తున్న సీఎం చంద్రబాబు... స్థానిక సంస్థలే కాదు తన మంత్రివర్గంలోనూ బీసీలకు పెద్దపీట వేయాలని భావించారు. ఈ క్రమంలోనే బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు ఈ దఫా మంత్రులుగా అవకాశం కల్పించాలని ఇప్పటికే సమీక్షలు ప్రారంభించారు. అంతర్గతంగా పార్టీ సేకరించిన రిపోర్టులతో పాటు వ్యక్తిగతంగా చంద్రబాబు ఆయా జిల్లాల్లో పర్యటించినప్పుడు నాయకుల పనితీరును చూసి వేసుకున్న అంచనాలను కూడా ఇప్పుడు సమీక్షిస్తున్నారు. తద్వారా నాయకులను మంత్రులుగా ఎంపిక చేసే విషయంపై దృష్టి పెట్టారు.దీనిలో ప్రధానంగా మహిళలకు ఎక్కువగా అవకాశం ఇవ్వాలన్నది చంద్రబాబు ఆలోచనగా ఉంది. తద్వారా మహిళా ఓటు బ్యాంకు ను ఆకర్షించాలని చూస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రెండు కోట్ల మందికి పైగా మహిళా ఓటర్లు ఉన్నారు. వీరిలో మెజారిటీ భాగం బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే కావడం, ఆ వర్గం వైపు టిడిపి ఎక్కువగా ఆశలు పెట్టుకున్న నేపథ్యంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళ ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించాలని చంద్రబాబు ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలో తాజాగా ఒక మహిళ ఎమ్మెల్యే పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.ఆవిడే గుంటూరు కు చెందిన గళ్ళ మాధవి. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో తొలిసారి విజయం సాధించిన మాధవి ఇటు పార్టీ పరంగా అటు వ్యక్తిగతంగా కూడా దూసుకుపోతున్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం విషయంలో కానీ ప్రజలకు అందుబాటులో ఉండే విషయంలో కానీ మాధవి మంచి మార్కులు సంపాదించుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల కాలంలో ఆమెను పార్టీ పొలిట్ బ్యూరోలోకి కూడా తీసుకున్నారు. ప్రధానంగా వైసిపి నేతలపై విరుచుకు పడడంలో ఈ విధంగా కౌంటర్లు ఇవ్వడంలో కూడా మాధవి ముందున్నారన్నది పార్టీ వర్గాలు చెబుతున్న మాట.ఈ క్రమంలోనే చంద్రబాబు సైతం ఆమె వైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. రజక సామాజిక వర్గానికి చెందిన మాధవికి మంత్రివర్గంలో అవకాశం కల్పించే విషయంపై చంద్రబాబు పరిశీలిస్తున్నట్టుగా పార్టీ వర్గాల నుంచి అత్యంత విశ్వసనీయ సమాచారం వైరల్ గా మారింది. మాధవికి అన్ని అర్హతలు ఉన్నాయని, ఇటు ప్రజల్లోనూ అటు పార్టీలోనూ మంచి పేరు ఉందని సమస్యలపై స్పందిస్తున్నారని సమస్యల పరిష్కారంతోపాటు అభివృద్ధి పనులు చేపట్టడం అదేవిధంగా ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడంలోనూ మాధవి నిరంతరం కృషి చేస్తున్నారని చంద్రబాబు ప్రగాఢంగా విశ్వసిస్తున్నారు.ఈ నేపథ్యంలోనే బీసీ సామాజిక వర్గంలో మరింత ఇమేజ్ పెంచుకునేందుకు మాధవికి అవకాశం ఇవ్వాలన్న నిర్ణయం దిశగా చంద్రబాబు అడుగులు వేస్తున్నట్టు సీనియర్ నాయకుల మధ్య చర్చ సాగుతోంది. అదేవిధంగా ఈసారి రాయలసీమ నుంచి మరో మహిళను బీసీ సామాజిక కోటాలో మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక ఉత్తరాంధ్ర నుంచి కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన మరో మహిళను కూడా తీసుకుంటారని అంటున్నారు మరి ఏం జరుగుతుందనేది చూడాలి.

భూములు ఇస్తాం.. ముందు పరిహారం తేల్చండి!



అదిలాబాద్ :ఆదిలాబాద్‌లో రక్షణ, పౌర విమానయాన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు భూసేకరణ వేగవంతమైంది.ఆదిలాబాద్ అర్బన్ పరిధిలోని 209.31 ఎకరాల సేకరణకు కలెక్టర్ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. మొత్తం ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అనుకుంట, ఖానాపూర్, మిషన్ ఘాట్, అర్లిబి, కచ్‌కంటి, టాక్లి పరిధిలో దాదాపు 1,882 ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం జీవో జారీ చేసింది. ప్రభుత్వ రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ చాలా తక్కువగా ఉందని,బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం ఎకరానికి రూ. 6 కోట్ల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అనుకుంట గ్రామం అభ్యంతరం: అనుకుంట గ్రామంలో 80% భూములు సేకరిస్తూ ఊరిని వదిలేయడంపై గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జీవనాధారమైన భూములు కోల్పోతున్న తమకు న్యాయమైన ధర ఇవ్వాలని, లేని పక్షంలో న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. భూసేకరణలో భూములు కోల్పోతున్న వారి అభ్యంతరాలు స్వీకరించేందుకు అనుకుంటలో ఆర్డీఓ జగదీశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించనున్నా రు.ఈ సమావేశంలో నిర్వాసితులు తమ డిమాండ్లను అధికారుల ముందుంచనున్నారు.

ఎవరు ఎక్కడ పోటీ.. డిసైడ్ చేసిన చంద్రబాబు



అమరావతి,కూటమి రాజకీయాలలో ఆసక్తికర మలుపులు చోటుచేసుకుంటున్నాయి. స్థానిక ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ మరో రోజులు ప్రారంభం అవుతోంది. అయినప్పటికీ సీట్ల సర్దుబాటు ప్రక్రియ ఒక కొలిక్కిరాలేదు. కూటమిగా పోటీ చేయడంపై మూడు పార్టీలు ఏకాభిప్రాయంతో ఉన్నప్పటికీ ఎవరు ఎక్కడ నుంచి పోటీ చేయాలన్నదే సస్పెన్స్ గా ఉంది. ఈ విషయంలో ఎలాంటి స్పష్టత లేకపోవడంతో మూడు పార్టీల్లోనూ గందరగోళమే రాజ్యమేలు తోంది. ప్రధానంగా ఈ విషయంలో బుధవారం వరకు జనసేన పార్టీ కాస్త పెత్తనం చేయగా, ఇప్పుడు పరిస్థితిలో పూర్తి మార్పు వచ్చినట్లుగా చెబుతున్నారు. తమకు 40 శాతం వాటా సీట్లు కావాలంటూ బహిరంగ ప్రకటన చేసిన జనసేన ఇప్పుడు అలాంటి సౌండ్ వినిపించడం లేదు. పైగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఏం చెబుతారు? ఆయన నిర్ణయం ఏంటో తెలుసుకునేందుకు ఎదురు చూస్తోందని అంటున్నారు.కూటమి పార్టీల మధ్య సర్దుబాటు విషయంలో సమన్వయ కమిటీ సభ్యులు ఏకాభిప్రాయం సాధించలేకపోవడంతో మొత్తం వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు తన చేతుల్లోకి తీసుకున్నారని అంటున్నారు. కూటమిలో ఎవరు ఎక్కడ బలం ఉంటే అక్కడ పోటీ చేద్దామని తేల్చిచెప్పిన చంద్రబాబు మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతలను ఏయే స్థానాల్లో పోటీకి పెడతామనే విషయాన్ని మాత్రం స్పష్టం చేయలేదు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబును మరోసారి కలిసి తమ పార్టీలు ఎక్కడెక్కడ పోటీ చేయాలనే విషయమై క్లారిటీ తీసుకోవాలని జనసేన, బీజేపీ నేతలు భావిస్తున్నారని చెబుతున్నారు. దీంతో జనసేన పార్టీకి చెందిన మంత్రి నాదెండ్ల మనోహర్, రాజ్యసభ సభ్యుడు లింగమేని రమేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో ఆయనతో సమావేశమయ్యారు.సుమారు రెండు గంటల పాటు జరిగిన సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నానేది బహిరంగంగా ప్రకటించలేదు. ఈ రోజు రాత్రికి తుది నిర్ణయం తీసుకుని బహిరంగంగా ప్రకటిస్తారని చెబుతున్నారు. నిన్నటి వరకు తాము అన్నిస్థానాల్లో పోటీ చేస్తాం.. ఇన్ని పదవులు కావాలంటూ పట్టుబట్టిన మిత్రపక్షాలు ఈ రోజు మాత్రం అటువంటి ప్రకటనల జోలికి వెళ్లకపోవడం, అటువైపు నుంచి లీకుల ద్వారా టీడీపీపై ఒత్తిడి పెంచే ప్రయత్నాలు కూడా లేకపోవడంతో సర్దుబాటుపై ఒక నిర్ణయానికి వచ్చి ఉంటారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే మూడు పార్టీల తరఫున మేయర్, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులుగా బలమైన నేతలను ఎంపిక చేసిన తర్వాతే ప్రకటన విడుదల చేయాలని సీఎం భావిస్తున్నారని చెబుతున్నారు.మేయర్, మున్సిపల్ సీట్లు పార్టీల పరంగా కాకుండా రాజకీయంగా ఆర్థికంగా బలమైన నాయకులను ముందుగా ఎంపిక చేసి వారి గెలుపు అవకాశాలపై ఒక అంచనాకు వచ్చిన తర్వాతే ఏ పార్టీ తరఫున పోటీ పెట్టాలనే నిర్ణయానికి రావాలని ప్రాథమికంగా నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. ఈ ప్రక్రియలో అవసరమైతే మూడు పార్టీల మధ్య నాయకులను సర్దుబాటు చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని నేతలు తీర్మానించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

బ్లూ డ్రమ్' హత్య కేసు.. దోషులకు మరణశిక్ష విధించిన కోర్టు



మీరట్ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మీరట్ బ్లూడ్రమ్ హత్య కేసులో స్థానిక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. మర్చంట్ నేవీ అధికారి అయిన ముస్కాన్ భర్త సౌరభ్ రాజ్‌పుత్ హత్య కేసులో ప్రధాన నిందితులైన ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాకు కోర్టు మరణశిక్ష విధించింది. ఈ కేసులో రెండు వారాల క్రితమే నిందితుల్ని దోషులుగా తేల్చిన డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ అరవింద్ కుమార్ మిశ్రా.. తాజాగా శిక్షను ఖరారు చేశారు. ఇద్దరు నిందితులు జైలు నుంచి వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు.

మహాభారత శ్లోకాన్ని ఉటకించిన జడ్జి.. ధర్మంలో భాగమే శిక్ష!

తీర్పు సందర్భంగా డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ అరవింద్ కుమార్ మిశ్రా మహాభారత శ్లోకాన్ని ఉటంకించారు. తప్పు చేసిన వారిని శిక్షించడం కూడా ధర్మంలో భాగమేనని (దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ) ఆయన పేర్కొన్నారు.ఈ తరహా దారుణ నేరాలు సమాజంలో తీవ్ర భయాందోళనలు కలిగిస్తాయని జడ్జి తీవ్రంగా వ్యాఖ్యానించారు. మరోవైపు, సౌరభ్ రాజ్‌పుత్ ఎంతో మంచి వ్యక్తి అని.. నిందితులకు మరణశిక్ష విధిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ముస్కాన్ రస్తోగి తల్లిదండ్రులు కోర్టుకు స్పష్టం చేశారు. అంతేకాదు, జైలులో ఉన్న ముస్కాన్‌ను వారు కలుసుకోకపోవడం గమనార్హం. ఈ కేసుకు సంబంధించి మొత్తం 122 విచారణలు జరగ్గా, 22 మంది సాక్షుల వాంగ్మూలాలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

హత్య వెనుక అసలు ప్లాన్ ఇదీ..

ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లా తమ వివాహేతర బంధానికి సౌరభ్ రాజ్‌పుత్ అడ్డుగా ఉన్నాడని భావించి, అత్యంత క్రూరంగా పథకం ప్రకారం ఈ హత్యకు పాల్పడినట్లు జడ్జి తేల్చారు. మార్చి 3, 2025న ముస్కాన్ రస్తోగి ఇంద్రానగర్‌లోని తమ నివాసంలో భర్త సౌరభ్ రాజ్‌పుత్‌కు ఆహారంలో మత్తు మందు కలిపి తినిపించింది. ఆ తర్వాత కొద్దిసేపటికి సాహిల్ శుక్లా అక్కడికి చేరుకున్నాడు. ఇద్దరూ కలిసి సౌరభ్‌ను కత్తులతో పొడిచి కిరాతకంగా హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని బాత్‌రూమ్‌లోకి తీసుకెళ్లి ముక్కలుగా నరికారు. దుర్వాసన రాకుండా ఆ శరీర భాగాలను ఓ బ్లూడ్రమ్‌లో వేసి.. సిమెంట్, ఇసుక, నీరు కలిపిన మిశ్రమం పోసి సీల్ చేశారు.

నిందితుల పరారీ.. దారుణం వెలుగులోకి వచ్చిందిలా

హత్య అనంతరం ఆ తర్వాతి రోజే నిందితులు ఇద్దరూ హిమాచల్‌ప్రదేశ్‌కు పారిపోయారు. సౌరభ్ ఫోన్ నుంచే అతడి కుటుంబ సభ్యులతో ముస్కాన్ చాట్ చేస్తూ, భర్త బతికే ఉన్నట్లు అందరినీ నమ్మించింది. అయితే, మార్చి 17న బంధువులు మరియు స్థానికులకు అనుమానం వచ్చి సౌరభ్ ఇంటికి వెళ్లి చూడటంతో ఈ దారుణ విషయం వెలుగులోకి వచ్చింది. ప్రాసిక్యూషన్ అందించిన బలమైన సాక్ష్యాధారాల ఆధారంగా కోర్టు నిందితులకు ఉరిశిక్షను ఖరారు చేసింది.

కరెంట్ కోతలకు ఏఐ చెక్ పెడుతుందా?



హైదరాబాద్,విద్యుత్ రంగంలో కృత్రిమ మేధస్సు వినియోగంపై జాతీయ సదస్సుకు TGSPDCL నుంచి తొమ్మిది మంది ఇంజినీర్లు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించడం, ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, వినియోగదారులకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడం లక్ష్యంగా TGSPDCL కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా, భారత విద్యుత్ రంగాన్ని కృత్రిమ మేధస్సు ఆధారితంగా తీర్చిదిద్దే అంశంపై న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ స్థాయి మేధోమథన సదస్సుకు సంస్థ నుంచి తొమ్మిది మంది ఇంజినీర్లను నామినేట్ చేసింది. న్యూఢిల్లీలోని మాణెక్షా సెంటర్, పరేడ్ రోడ్‌లో అక్టోబర్ 14, 15 తేదీల్లో 'CEA Brainstorming Event -- Making Indian Power Sector AI Enabled' పేరుతో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. TGSPDCL సీఎండీ శ్రీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ దార్శనికతకు అనుగుణంగా ఇంజినీర్లలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ఆధునిక డిజిటల్ పరిష్కారాలను విద్యుత్ పంపిణీ కార్యకలాపాల్లో వినియోగించడం వంటి అంశాలకు సంస్థ ప్రాధాన్యత ఇస్తోంది. మారుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా సీనియర్, యువ ఇంజినీర్లు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సీఎండీ ఆకాంక్షిస్తున్నారు.

విద్యుత్ రంగంలో ఏఐతో మెరుగైన సేవలకు అవకాశాలు

కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ, కేంద్ర నూతన మరియు పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ, కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ , కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ , భారత వాణిజ్య మరియు పరిశ్రమల సమాఖ్య (FICCI), GRID-INDIA, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన ప్రముఖులు, ఉన్నతాధికారులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. విద్యుత్ రంగంలో కృత్రిమ మేధస్సు వినియోగం, డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న నిర్వహణ పద్ధతులు, ఆధునిక పరిష్కారాలపై చర్చించేందుకు ఈ సదస్సు కీలక వేదికగా నిలుస్తోంది. ఏఐ, డిజిటల్ టూల్స్‌ను సమర్థంగా వినియోగించడం ద్వారా విద్యుత్ వ్యవస్థ పనితీరును నిరంతరం పర్యవేక్షించడం, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాల్లో సంభవించే వైఫల్యాలను ముందుగానే గుర్తించడం, విద్యుత్ అంతరాయాల నిర్వహణను మెరుగుపరచడం, కార్యకలాపాల సమాచారాన్ని వేగంగా విశ్లేషించడం, రోజువారీ విధుల్లో ఆటోమేషన్‌ను పెంచడం వంటి అంశాలపై ఇంజినీర్లకు అవగాహన కలగనుంది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం

వివిధ విభాగాలకు చెందిన ఇంజినీర్లు ఈ సదస్సులో పాల్గొనడం ద్వారా పొందే పరిజ్ఞానం, ఆలోచనల మార్పిడి సంస్థ కార్యకలాపాల్లో ఆచరణాత్మక మార్పులకు దోహదపడుతుందని TGSPDCL భావిస్తోంది. సదస్సులో నేర్చుకున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యుత్ పంపిణీ వ్యవస్థలో అన్వయించడం ద్వారా నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడం, సమస్యలను వేగంగా గుర్తించి పరిష్కరించడం, క్షేత్రస్థాయి సిబ్బంది పనులను సులభతరం చేయడం సాధ్యమవుతుంది.ఇంజినీర్లకు నిరంతర అభ్యాసం, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, వినూత్న ఆలోచనలకు అవకాశాలు కల్పిస్తూ, భవిష్యత్తు అవసరాలకు సిద్ధంగా ఉండే ఆధునిక విద్యుత్ పంపిణీ సంస్థగా TGSPDCLను తీర్చిదిద్దాలన్న సీఎండీ శ్రీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ దార్శనికతకు ఈ కార్యక్రమం ప్రతిబింబంగా నిలుస్తోంది. తద్వారా సంస్థ పనితీరును మరింత మెరుగుపరిచి, వినియోగదారులకు విశ్వసనీయమైన, నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా TGSPDCL ముందుకు సాగుతోంది.

ఖైరతాబాద్ లిట్మస్ టెస్ట్ : కేసీఆర్ వైపు తిరిగిన తెలంగాణా !



హైదరాబాద్,రాజకీయం ఎపుడూ ఒకేలా ఉండదు. అది మారుతూ ఉంటుంది. ప్రజాభిప్రాయం నిరంతరం గతులు మార్చుకుంటుంది. 2023లో కేసీఆర్ ఓడిపోగానే ఆయన పని అయిపోయింది అని అన్న వారు ఉన్నారు. 2024 లో లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కి ఒక్క పార్లమెంట్ సీటు కూడా రాలేదు, ఆ తరువాత జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ రెండు ఎమ్మెల్యే సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ కి చేదు అనుభవాలు ఎదురయ్యాయి. కానీ అది నిజం కాదని తాజాగా ఖైరతాబాద్ లో ఒక ప్రముఖ సర్వే సంస్థ ఆర్ఆర్ నిర్వహించిన దాంట్లో తేలింది. ఇందులో విశ్లేషణలు చూస్తే కనుక బీఆర్ఎస్ దే మరోసారి తెలంగాణాలో అధికారం అన్నది తేలుతోంది. లిట్మస్ టెస్ట్ గా రేపు జరగబోయే ఖైరతాబాద్ ఉప ఎన్నికల ఫలితం ఉండబోతోంది అని ఈ సర్వే స్పష్టం చేసింది.

తరువాత సీఎం ఆయనే :

ఖైరతాబాద్ ఉప ఎన్నికల గురించి జనాభిప్రాయాన్ని ఆర్ ఆర్ సర్వే చాలా లోతుల్లోకి వెళ్ళి రాబట్టింది. దానిలో కేసీఆర్ పాలన గురించి జనాలను ప్రశ్నించినపుడు అత్యధిక శాతం ఆయన హయాంలో బాగుంది అని చెప్పారు. అంతే కాదు 2028 లో జరిగే ఎన్నికల్లో సీఎం ఎవరు అంటే కేసీఆర్ అని ఏకంగా 53.84 శాతం మంది ఓటేశారు. ఇక ప్రస్తుతం సీఎం గా ఉన్న రేవంత్ రెడ్డికి 20.87 శాతం మద్దతు తెలిపితే బీజేపీ ఫైర్ బ్రాండ్, కేంద్ర మంత్రి బండి సంజయ్ తదుపరి సీఎం అంటూ కేవలం 14.30 మంది చెప్పారు. మరో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డికి 4.39 శాతం లభించింది. ఈ సర్వే ప్రకారం చూస్తే కనుక అందరి కంటే చాలా దూరంలోనే కేసీఆర్ నిలిచి తెలంగాణా ప్రజల అభిమానం అందుకున్నారు అని అర్థం అవుతోంది.

ఉత్తమ పాలనగానూ :

అంతే కాదు కేసీఆర్ పరిపాలన ఉత్తమంగా ఉందని, అభివృద్ధి సంక్షేమం ఆయన హయాంలోనే బాగా జరిగాయని ఖైరతాబాద్ జనాలు బల్ల గుద్ది మరీ చెప్పారు. ఆర్ఆర్ సర్వే ప్రకారం చూస్తే రెండు సార్లు సీఎం గా చేసిన కేసీఆర్ కి మద్దతుగా 57.14 శాతం మంది నిలిచారు. అదే సమయంలో రేవంత్ రెడ్డి రెండున్నరేళ్ళ పాలన బాగుందని 21.97 శాతం మంది మాత్రమే మద్దతు ఇవ్వడం విశేషం. అంటే కాంగ్రెస్ ప్రభుత్వం తాము చెప్పుకుంటున్నట్లుగా తెలంగాణాలో అభివృద్ధి సంక్షేమం పట్ల జనం అంత సంతృప్తిగా లేరు అన్నది రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఒక కీలక నియోజకవర్గం. రాజకీయంగా చైతన్యవంతమైన ఖైరతాబాద్ లో ఓటర్ల మనోభావాలు తెలియచేశాయని అంటున్నారు.

ఎన్నికల హామీల అమలులో :

అంతే కాదు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కంటే ఎన్నికల హామీల అమలుతో సక్రమంగా పనిచేసింది అని ఆర్ఆర్ సర్వే ప్రకారం జనాలు కితాబు ఇస్తున్నారు. బీఆర్ ఎస్ సర్కార్ ఇచ్చిన మాట మేరకు హామీలు నెరవేర్చింది అని అన్న మాట వస్తోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

అని 54.94 శాతం మంది చెబుతూ జై కొట్టారు. అదే కాంగ్రెస్ ఎన్నికల హామీల విషయంలో అంత కచ్చితంగా అమలు చేయడం లేదన్న భావనలో జనాలు ఉన్నారనడానికి ఆ పార్టీకి 19.78 శాతం ప్రజల మద్దతు దక్కడం ఒక ఉదాహరణగా చూడాలని అంటున్నారు.

కేసీఆర్ రాకుండానే :

లిట్మస్ టెస్ట్ అంటే అన్నంలో ఒక మెతుకుని పట్టడం లాంటిది. ఖైరతాబాద్ లో ఉప ఎన్నికలు జరగలేదు. జనం మూడ్ ఇదీ అని ఆర్ఆర్ సర్వే తన నివేదిక బయటపెట్టింది. దాని ప్రకారం చూస్తే అక్కడ ఉప ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ అభ్యర్థి గెలుస్తారు అని 36.89 శాతం ఓటు షేర్ దక్కుతుందని ఈ సర్వే వెల్లడిస్తోంది. అదే కాంగ్రెస్ కి 34.78 శాతం ఓటు షేర్ దక్కి రెండో ప్లేస్ లో ఉంటుందని తేటతెల్లం చేసింది. ఇవన్నీ పక్కన పెడితే గత రెండున్నరేళ్ల బట్టి కేసీఆర్ అయితే జనంలో లేరు, ఆయన పెద్దగా సభలు సమావేశాలు కూడా నిర్వహించలేదు. కానీ ఆయన తదుపరి సీఎం అని జనాలు అంటున్నారు. అలాగే బీఆర్ ఎస్ హామీలు బాగా నెరవేర్చింది అని సమర్థిస్తున్నారు.

సరికొత్త రాజకీయ సరళిగా :

బీఆర్ఎస్ పాలన బెస్ట్ అని ప్రశంసిస్తున్నారు. మరి ఎన్నికల ముందు కనుక కేసీఆర్ జనంలోకి వచ్చి ప్రచారం చేస్తే ఇంకా ఈ సానుకూలత పెరుగుతుందని అంటున్నారు. ఏది ఏమైనా ఆర్ ఆర్ సర్వే అయితే జనం నాడిని పట్టుకుంది అని అంటున్నారు. అధికార పార్టీలకు యాంటీ ఇంకెంబెన్సీ అన్నది పెరగడం ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా ఒక సరికొత్త రాజకీయ సరళిగా ఉంది. ఒక అయిదేళ్లకు మాత్రమే ప్రభుత్వాన్ని జనాలు ఎన్నుకుంటున్నారు. రెండోసారి చాన్స్ ఇచ్చేందుకు ఇష్టపడడం లేదు, అది తమిళనాడులో ఇటీవల ఎన్నికల్లో వెల్లడైంది. ఏపీలో వరుస మూడు ఎన్నికల్లో అలాగే జరిగింది. రేపటి ఎన్నికల్లో తెలంగాణాలో అదే జరుగుతుందా అంటే ఆర్ఆర్ సర్వే ప్రకారం చూస్తే అవును అన్న మాట వస్తోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

భారత్‌లో 'సర్' అమలు తీరుపై పెదవి విరిచిన యూఎస్ ప్రజాప్రతినిధి ప్రమిలా జయ్‌పాల్



న్యూఢిల్లీ, భారతదేశంలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ పై అమెరికా కాంగ్రెస్ సభ్యురాలు, భారత సంతతికి చెందిన ప్రమిలా జయ్‌పాల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సర్ ప్రక్రియ ద్వారా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా నుండి దాదాపు 13 కోట్ల మంది (130 మిలియన్లు) ఓటర్ల పేర్లను తొలగించడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా వెలుగొందుతున్న ఇండియాలో గంప గుత్తగా ఇంత పెద్ద మొత్తంలో పేర్లను తొలగించడాన్ని ప్రమిలా జయ్‌పాల్ "ప్రజాస్వామ్య వ్యతిరేక ప్రయత్నం"గా అభివర్ణించారు. అంతేకాదు అమెరికాలో ఓటర్ల హక్కులను కాలరాయడానికి గతంలో యూఎస్ ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ యంత్రాంగం అనుసరించిన వ్యూహాల తరహాలోనే ప్రస్తుతం భారతదేశంలో కూడా జరుగుతోందని ఆమె సోషల్ మీడియా వేదికగా విమర్శించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం శాంతియుతంగా చేపట్టి

ప్రజాస్వామ్య వాదులు ఇలాంటి చర్యలను హర్షించబోరన్నారు. 'సర్'ను ప్రక్రియకు వ్యతిరేకంగా ఓటర్ల తొలగింపును నిరసిస్తూ ఢిల్లీ, ముంబై సహా భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న శాంతియుత నిరసన ప్రదర్శనలకు ఆమె తన పూర్తి మద్దతును ప్రకటించారు. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు పునాది అని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం శాంతియుతంగా చేపట్టి ఎలాంటి చర్యలకైనా మద్దతు ప్రకటించాలని ఆమె పిలుపునిచ్చారు. కాగా, సర్‌పై దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు ఆందోళనలు చేపట్టాయి. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న తరుణంలో ప్రమిలా జయ్‌పాల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140